thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 118| జగిత్యాల | మంగళవారం 28 జూలై, 2026 ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

ఈషాకు గోల్డ్, మనుకు బ్రాంజ్.!





## లోక్‌సభలో పేపర్ లీకేజీ సవరణ బిల్లు

- పార్లమెంట్‌లో కొనసాగిన ప్రతిష్టంభన
- మోడీ, అమిత్‌షా క్షమాపణలకు విపక్షాల డిమాండ్

4



## విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందే

- రాహుల్ గాంధీ డిమాండ్

4

# ఏ విద్యార్థి ఆకలితో ఉండకూడదు

విద్యార్థుల సంక్షేమమే మా లక్ష్యం

- ఆర్థిక ఇబ్బందులు అడ్డుకావు
- ప్రతి విద్యార్థికి పోషకాహారం
- మూడునెలల్లో రాష్ట్రవ్యాప్తంగా పథకం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా ఆకలితో లేదా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా అల్పాహార పథకాన్ని అమలు చేస్తున్నట్లు డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లాలో సోమవారం ఈ పథకాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు.

- ఖమ్మం, జూలై 27 02

## ఆగస్ట్‌లో అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

కసరత్తు చేస్తున్న ప్రభుత్వం 02






# హైడ్రా కమిషనర్‌ను తొలగించండి

- పదేపదే కోర్టు ఉల్లంఘనలకు పాల్పడడంపై ఆగ్రహం
- ఇలాంటి వ్యక్తి అదే పోస్టులో కొనసాగడం సరికాదు
- లోతుకుంట భూముల వ్యవహారంపై హైకోర్టు విచారణ
- కోర్టులంటే గౌరవం ఉందంటూ రంగనాథ్ క్షమాపణలు

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన్ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని సీఎస్‌ను ఆదేశించింది. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులను ఆశ్రయించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని పేర్కొంది. ఉన్నతాధికారిగా ఉన్న రంగనాథ్.. కోర్టు ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని ఆక్షేపించింది. మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట భూములకు సంబంధించి గతంలో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను హైడ్రా ఉల్లంఘించిందంటూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నా.. ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారని పేర్కొంది. ఒకే పిటిషన్‌కు సంబంధించి పలుమార్లు కోర్టు ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ ధిక్కరించడం నేరమని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 2

## పెద్ది సుదర్శన్‌రెడ్డిని పరామర్శించిన

# కేసీఆర్, సీతక్క

యశోద ఆస్పత్రిలో ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న నేతలు

కుటుంబ సభ్యులకు మనోధైర్యం.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష 2





## కేంద్రం హామీలు బుట్టదాఖలు

4

- కేసుల ఉపసంహరణపై కదలిక లేదు
- దేశవ్యాప్త ఆందోళనలకు సీజేపీ హెచ్చరిక
- విద్యార్థులకు న్యాయసాయం కోసం 'సాక్షి' ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభం

## బంగాళాఖాతంలో అల్పపీడనం

తెలంగాణ జిల్లాల్లో వర్షాలకు ఛాన్స్



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో వచ్చే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. 2

## సింగరేణిని భ్రష్టు పట్టించిన కేసీఆర్



- కాంగ్రెస్ వచ్చినా మారని పరిస్థితి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు

3

## కృష్ణా జలాల్లో వాటాకు ఏపీ డిమాండ్

- బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేసిన ఏపీ
- విచారణను సెప్టెంబర్‌కు వాయిదా వేసిన సుప్రీం

2





3

## పారిశ్రామికాభివృద్ధి మరింత వేగం

ఈ-సిటీ, మంఖాల్, మహేశ్వరం పారిశ్రామిక పార్కులలో సీఎస్ సంజయ్ జాజు విస్తృత పర్యటన

పెట్టుబడులు, తయారీ సామర్థ్యం, ఉపాధి కల్పనపై సమీక్ష

## డ్రగ్స్ మత్తులో

పోలీసులపై దూసుకెళ్లిన కారు

- హెడ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు..
- ఇన్‌స్పెక్టర్ సహా మరో ఇద్దరికి స్వల్ప గాయాలు
- హత్యాయత్నం కేసులు నమోదు..
- నిందితుడు సైఫ్ అరెస్ట్

2








# ఆగస్టులో అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

## కసరత్తు చేస్తున్న ప్రభుత్వం

**హైదరాబాద్, జూలై 27:** రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలను ఆగస్టులో నిర్వహించే అవకాశం ఉన్నది. మార్చిలో బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఇప్పటి వరకు సమావేశాలు జరుగలేదు. సాధారణంగా సమావేశానికి, సమావేశానికి మధ్య ఆరు నెలలు మించవద్దు. ఈ లెక్కన సెప్టెంబర్‌లోపు శాసనసభ సమావేశాలు జరుగాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆగస్టులో కనీసం వారం రోజులపాటు శాసనసభ సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నది. అన్నీ అనుకూలిస్తే ఆగస్టు 17 నుంచి సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తున్నది. లేక పోతే ఆగస్టు 24 నుంచి జరగవచ్చని అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఆదివారం కొన్ని జాతీయ మీడియా చానళ్లతో మాట్లాడుతూ.. ఆగస్టులో శాసనసభ సమావేశాలు పెడ్తామని, ఈ సమావేశాల్లో.. ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీచేసే వారి కనీస వయోపరిమితిని 25 ఏండ్ల నుంచి 21 సంవత్సరాలకు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఒక తీర్మానం పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశాల్లో మరికొన్ని తీర్మానాలు, బిల్లులు పెట్టే అవకాశం ఉన్నది. శాసనసభ, శాసనమండలిలో ఆధునీకరించిన భవన సముదాయాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టులో ప్రారంభించనున్నారు. ఇటీవల శాసనసభకు వచ్చిన రేవంత్‌రెడ్డి.. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సెంట్రల్ హాల్ సహా మంత్రుల చాంబర్ల పునర్నిర్మాణ పనులను ఆగస్టు 10లోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి.

# పెద్ది సుదర్శన్‌రెడ్డిని పరామర్శించిన కేసీఆర్, సీతక్క

## యశోద ఆస్పత్రిలో ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న నేతలు

## కుటుంబ సభ్యులకు మనోధైర్యం.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



**హైదరాబాద్, జూలై 27:** మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, రాష్ట్ర మంత్రి సీతక్క ఆదివారం యశోద ఆస్పత్రిలో పరామర్శించి అడిగి తెలుసుకున్నారు. తీవ్ర గుండెపోటుతో చికిత్స పొందుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డికి అందుతున్న వైద్య సేవలపై వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. ఎర్రవెల్లిలోని తన నివాసం నుంచి యశోద ఆస్పత్రికి చేరుకున్న కేసీఆర్.. వైద్యులతో మాట్లాడి పెద్ది ఆరోగ్య పరిస్థితి, చికిత్స వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం నింపారు. కేసీఆర్ వెంట బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. మరోవైపు రాష్ట్ర మంత్రి సీతక్క కూడా యశోద ఆస్పత్రికి చేరుకుని పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కేటీఆర్ కూడా మరోసారి వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. కాగా, ఆదివారం ఉదయం హనుమకొండలోని తన నివాసంలో పెద్ది సుదర్శన్‌రెడ్డికి తీవ్ర గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు తొలుత సమీపంలోని రోహిణి ఆస్పత్రికి తరలించారు. అక్కడ కార్డియాలజిస్ట్ డాక్టర్ మమతారెడ్డి నేతృత్వంలో వైద్యులు అత్యవసర చికిత్స, సీపీఆర్ అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గ్రీన్ ఛానల్ ద్వారా హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు నిపుణుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది.

# కృష్ణా జలాల్లో వాటాకు ఏపీ డిమాండ్

## బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేసిన ఏపీ

**న్యూఢిల్లీ, జూలై 27:** కృష్ణా జలాల్లో వాటాకు సంబంధించి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం కేసును పరిశీలించింది. సుదీర్ఘ విచారణ చేయాల్సి ఉన్నందున.. ఈ కేసును ప్రత్యేక బెంచ్ ముందు విచారణకు నివేదిస్తామని వెల్లడించింది. అనంతరం తదుపరి విచారణను సెప్టెంబర్ మొదటి వారానికి వాయిదా వేసింది. ఈలోగా తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేయాలంటూ కర్ణాటక ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. కృష్ణా నదీ జలాల వాటాలపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ట్రిబ్యునల్ తీర్పును కేంద్ర ప్రభుత్వం నోట్ఫి÷ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పైనే ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

# ఆకలితో ఏ విద్యార్థి ఉండకూడదు

- విద్యార్థుల సంక్షేమమే మా లక్ష్యం
- ఆర్థిక ఇబ్బందులు అడ్డుకావు
- ప్రతి విద్యార్థికి పోషకాహారం
- మూడునెలల్లో రాష్ట్రవ్యాప్తంగా పథకం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**ఖమ్మం, జూలై 27:** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార పథకాన్ని ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యకరమైన అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి పేర్కొన్నారు. ఖాళీ కడుపుతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు పాఠాలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారని, వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. సహజ వనరులు ఎంత ముఖ్యమో, మానవ వనరులు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్న డిప్యూటీ సీఎం.. మానవ వనరుల అభివృద్ధిపై పెట్టుబడి పెడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 22 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించడం చిన్న విషయం కాదని, ఇది దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో కూడా అరుదైన కార్యక్రమమని వ్యాఖ్యానించారు. ఈ పథకాన్ని రాబోయే మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విస్తరిస్తామని తెలిపారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ అందించేలా మెనూను రూపొందించామని వెల్లడించారు. పాలన అంటే అధికారం చెలాయించడం కాదని.. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన పాలన అని భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందించిన సమయంలో వారి కళ్లలో కనిపించిన ఆనందమే ప్రభుత్వ పనితీరుకు నిజమైన గుర్తింపు అన్నారు. మధిర ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాటిని పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను ఇప్పుడు అమలు చేస్తున్నామని చెప్పారు. రైతుల ఖాతాల్లో తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు జమ చేశామని, మహిళలకు ప్రతి ఏడాది రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని వెల్లడించారు. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా అభివర్ణించడం సరైంది కాదని.. అలా మాట్లాడేవారు పూర్తి అవగాహన లేకుండా వ్యాఖ్యానిస్తున్నారని భట్టి విమర్శించారు. మధిర ప్రజలు తనను గెలిపించడంతోనే కాంగ్రెస్ పార్టీ తనకు డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అల్పాహార పథకం కేవలం మధిర నియోజకవర్గానికే పరిమితం కాదని, తెలంగాణలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# హైడ్రా కమిషనర్‌ను తొలగించండి

## కోర్టు ఉల్లంఘనలకు పాల్పడడంపై ఆగ్రహం

## ఆయన ఆ పోస్టులో కొనసాగడం సరికాదు

## లోతుకుంట భూములపై హైకోర్టు విచారణ




**హైదరాబాద్, జూలై 27:** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన్ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని సీఎస్‌ను ఆదేశించింది. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులను ఆశ్రయించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని పేర్కొంది. ఉన్నతాధికారిగా ఉన్న రంగనాథ్.. కోర్టు ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని ఆక్షేపించింది. మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట భూములకు సంబంధించి గతంలో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను హైడ్రా ఉల్లంఘించిందంటూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నా.. ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారని పేర్కొంది. ఒకే పిటిషన్‌కు సంబంధించి పలుమార్లు కోర్టు ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ ధిక్కరించడం నేరమని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కోర్టుకు ఆయన హాజరుకావాలని ఆదేశించింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ జోక్యం చేసుకుని దీనిపై పూర్తిస్థాయిలో అఫిడవిట్ దాఖలు చేస్తామని తెలిపారు. అఫిడవిట్‌లో రంగనాథ్ క్షమాపణ కోరారు. కోర్టుల పట్ల పూర్తిస్థాయి నమ్మకముందని పేర్కొన్నారు. లోతుకుంట సర్వే నంబర్ 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమిలోకి వెళ్లలేదని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని, దీనికి కారణమేంటని ప్రభుత్వం తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ క్రమంలో రంగనాథ్‌ను తొలగించాలని పేర్కొంటూ.. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని ఆదేశించింది. లోతుకుంట భూముల వ్యవహారానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాలంటూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ధర్మాసనం పేర్కొంది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. లోతుకుంట ప్రైవేటు భూములపై హైడ్రా జోక్యాన్ని తప్పుబట్టింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని.. రంగనాథ్‌ను తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షమాపణలు తెలిపారు. కోర్టులు, న్యాయ వ్యవస్థపై తనకు ఎంతో నమ్మకం ఉందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే లోతుకుంట సర్వే నంబర్లు 1, 2 పరిధిలోని 40 ఎకరాల భూమిలోకి హైడ్రా బృందం వెళ్లలేదని కోర్టుకు వివరించారు. ఈ విషయంలో పిటిషనర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని కూడా రంగనాథ్ తన అఫిడవిట్‌లో తెలిపారు.

# డ్రగ్స్ మత్తులో పోలీసులపై దూసుకెళ్లిన కారు

## హెడ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు..

## ఇన్‌స్పెక్టర్ సహా మరో ఇద్దరికి స్వల్ప గాయాలు

## హత్యాయత్నం కేసులు నమోదు.. నిందితుడు సైఫ్ అరెస్ట్

**హైదరాబాద్, జూలై 27:** డ్రగ్స్ మత్తులో ఉన్న ఓ యువకుడు తనను అడ్డుకునేందుకు వచ్చిన పోలీసులపై కారుతో దూసుకెళ్లిన ఘటన హైదరాబాద్‌లో కలకలం రేపింది. ఈ ఘటనలో ఓ హెడ్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడగా, ఇన్‌స్పెక్టర్‌తో పాటు మరో కానిస్టేబుల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. నిందితుడు సైఫ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని అబిడ్స్, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. అబిడ్స్ ప్రాంతంలో డ్రగ్స్ కొనుగోలు, విక్రయాలు జరుగుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మహేందర్ యాదవ్‌కు సమాచారం అందడంతో ఆయన ఉన్నతాధికారులకు తెలియజేశారు. దీంతో హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం అబిడ్స్ పరిసరాల్లో నిఘా ఏర్పాటు చేసింది. ఆదివారం మధ్యాహ్నం ఓ కారు అబిడ్స్‌కు చేరుకోగా, కారులో ఉన్న వ్యక్తికి మరో వ్యక్తి అనుమానాస్పద ప్యాకెట్ అందజేశాడు. వెంటనే మాటువేసిన పోలీసులు ప్యాకెట్ అందించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని, కారులో ఉన్న వ్యక్తిని బయటకు రావాలని ఆదేశించారు. అయితే కారు పక్కకు తీస్తున్నట్లు నటించిన నిందితుడు ఒక్కసారిగా రివర్స్‌లో వేగంగా వాహనం నడిపాడు. ఈ క్రమంలో అడ్డుకునేందుకు ప్రయత్నించిన హెడ్ కానిస్టేబుల్ మహేందర్ యాదవ్ కాలిపై కారును ఎక్కించడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, మరో కానిస్టేబుల్ కూడా స్వల్ప గాయాలపాలయ్యారు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించగా, పోలీసులు వెంటాడి అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో కారును అడ్డగించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని హుస్సేనీ ఆలం ప్రాంతానికి చెందిన సైఫ్‌గా గుర్తించారు. గాయపడిన హెడ్ కానిస్టేబుల్ మహేందర్ యాదవ్‌ను సోమాజిగూడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, ఆయన కాలుకు ఫ్రాక్చర్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. మహేందర్ ఫిర్యాదు మేరకు సైఫ్‌పై అబిడ్స్, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. డ్రగ్స్ వ్యవహారంతో పాటు ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# బంగాఖాతంలో అల్పపీడన ప్రభావం

## తెలంగాణ జిల్లాల్లో వర్షాలకు ఛాన్స్



హైదరాబాద్, జూలై 27 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో వచ్చే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఐఎండీ అంచనాల ప్రకారం సోమవారం రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో మధ్యాహ్నం తర్వాత నుంచి రాత్రి వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదేవిధంగా నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సిద్ధిపేట, జనగామ, కరీంనగర్, హనుమకొండ, వరంగల్, నారాయణపేట జిల్లాల్లో విస్తారంగా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా చిరుజల్లులు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, వాగులు, వంకలు పొంగిపొర్లడం, రహదారులపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశముందని ఐఎండీ హెచ్చరించింది. అత్యవసర పరిస్థితులు మినహా వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు వెళ్లొద్దని, ప్రజలు వాతావరణ శాఖ సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాయవ్య బంగాళాఖాతం దానికి ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలపై ఏర్పడిన అల్పపీడనం ఆదివారం వాయుగుండంగా మారిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రాబోయే 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఈ వాయుగుండం సోమవారం పారాదీప్-సాగర్ ద్వీపాల మధ్య ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలను దాటుతుందని వెల్లడించింది. దీని ప్రభావంతో 31వరకు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులతోపాటు కూడిన వర్షాలు కురుస్తాయని వివరించింది. కాగా, జూలైలో రాష్ట్రంలో 43శాతం లోటు వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొన్నది. సాధారణ సగటు వర్షపాతం 227.4 మి.మీ కురువాల్సి ఉండగా, 109.7 మి.మీ కురిసిందని తెలిపింది.

# సింగరేణిని భ్రష్టు పట్టించిన కేసీఆర్

- కాంగ్రెస్ వచ్చినా మారని పరిస్థితి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు



**న్యూఢిల్లీ, జూలై 27:** గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి తీవ్ర నష్ట చేకూర్చిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సింగరేణి మెరుగుపడటం లేదని వ్యాఖ్యానించారు. కేంద్రం 49 శాతం, తెలంగాణ ప్రభుత్వం 51శాతం వాటాతో సింగరేణి కొనసాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. దక్షిణ భారత దేశంలోనే అతిపెద్ద బొగ్గు కంపెనీ సింగరేణి అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి నుంచి కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, ఎన్‌టీపీసీకి బొగ్గు సరఫరా అవుతుందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్.. సింగరేణికి తీరని ద్రోహం చేశారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి ఆదాయానికి గత ప్రభుత్వం గండికొట్టిందని ఆరోపించారు. రాజకీయ వేదికలకు సింగరేణిని వాడుకున్నారంటూ బీఆర్ఎస్, కేసీఆర్‌పై కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వింత ప్రవర్తన, మొండి వైఖరి వల్లే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోయిందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా బొగ్గు గనులను పారదర్శకంగా వేలం పాట ద్వారా కేటాయించాలని ఆదేశించినప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేలం పాటల్లో పాల్గొనకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. నూతన బొగ్గు బ్లాకులు లభించక, ఆదాయ మార్గాలు మూసుకుపోయి సింగరేణి వెనుకబడిపోవడానికి కేసీఆర్ ద్రోహమే కారణమని ఆయన ఆరోపించారు. సంస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని, గతంలో కేంద్రం ఇచ్చే రూ. 525 కోట్ల నిధులను సక్రమంగా వినియోగించుకోలేకపోయారని విమర్శించారు. 2015లోనే ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించినప్పటికీ, నాటి కేసీఆర్ ప్రభుత్వం ఒడిశా ముఖ్యమంత్రితో కనీసం మాట్లాడలేదని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అయితే, ఇటీవల ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చొరవ తీసుకుని నైని కోల్ బ్లాక్‌కు సంబంధించి అవసరమైన అన్ని అనుమతులను ఇప్పించినట్లు వెల్లడించారు. అలాగే తాడిచర్ల-2 బ్లాక్‌ను కూడా కేంద్రం సింగరేణికి కేటాయించిందని, మణుగూరులోని ఒక బ్లాక్‌ను వేలంలో ఉంచామని తెలిపారు. అయితే ఈ వేలంలో సింగరేణికి పోటీగా తెలంగాణ జెన్కో పాల్గొనడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. జెన్కో టెండర్ నుంచి తప్పుకుని, ఆ బ్లాకులు సింగరేణికి దక్కేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై సీఎంకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఈ మూడు కొత్త బ్లాకులు సింగరేణికి దక్కితే సుమారు 6,500 మందికి ఉద్యోగావకాశాలు రావడంతో పాటు, 830 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి, దాదాపు రూ. 1.95 లక్షల కోట్ల టర్నోవర్‌తో సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పబ్లిక్ పరీక్షల చట్టం గురించి మాట్లాడుతూ.. 2024లోనే ఎలాంటి డిమాండ్లు, నిరసనలు లేకపోయినా ముందస్తు జాగ్రత్తగా ఈ యాంటీ-పేపర్ లీక్ బిల్లును తీసుకొచ్చామని తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా పేపర్ లీకేజీలకు పాల్పడాలంటే భయపడేలా, గుండెలాగిపోయే స్థాయిలో అత్యంత కఠినమైన నిబంధనలతో ఈ చట్టాన్ని రూపొందించామని చెప్పారు. విద్యా వ్యవస్థలో మార్పుల కోసం ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా స్వాగతిస్తుందని భావిస్తే, వారు చట్టాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం విచారకరమన్నారు. ఫలితాలు వచ్చిన వేళ నిరాశతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారిలో ధైర్యాన్ని నింపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చివరగా, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన దాడి ఘటన తీవ్ర బాధాకరమని, దీనిపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ జరుపుతోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సర్కార్ అండ?

- హైకోర్టు తీర్పుపై అప్పీల్‌కు సిద్ధమవుతున్న ప్రభుత్వం
- న్యాయ నిపుణులతో చర్చలు.. డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించే యోచన
- హైడ్రా రద్దు చేయాలని బీజేపీ డిమాండ్



**హైదరాబాద్, జూలై 27:** హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌ను పదవి నుంచి తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం న్యాయపరమైన పోరాటానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. హైడ్రా కమిషనర్‌కు ప్రభుత్వ మద్దతు కొనసాగనున్నట్లు తెలుస్తుండగా, హైకోర్టు తీర్పుపై అప్పీల్ దాఖలు చేసే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. సమాచారం మేరకు, ఈ అంశంపై న్యాయ నిపుణుల అభిప్రాయాలను సేకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్‌కుమార్‌ను న్యూఢిల్లీకి పంపినట్లు సమాచారం. అలాగే గతంలో నమోదైన కోర్టు ధిక్కరణ పిటిషన్లు, సంబంధిత న్యాయపరమైన అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. హైకోర్టు పూర్తి తీర్పు కాపీ అందిన అనంతరం సింగిల్ బెంచ్ తీర్పును డివిజన్ బెంచ్‌లో సవాలు చేసే అవకాశాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. లోతుకుంట భూముల కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలను పదేపదే ఉల్లంఘించారని పేర్కొంటూ ఆయనను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తొలగించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లను ప్రస్తావించిన ధర్మాసనం, అర్హత కలిగిన అధికారిని కమిషనర్‌గా నియమించాలని సూచించింది. రంగనాథ్ అదే పదవిలో కొనసాగితే చట్ట పాలనకు విఘాతం కలుగుతుందని వ్యాఖ్యానించింది. ఇదిలా ఉండగా, హైడ్రా వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలని తెలంగాణ బీజేపీ డిమాండ్ చేసింది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు మాట్లాడుతూ, హైకోర్టు తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టులాంటిదని వ్యాఖ్యానించారు. పేదల ఇళ్లనే హైడ్రా లక్ష్యంగా చేసుకుందని, ప్రభావశీలుల అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఫాతిమా కాలేజీ వంటి అంశాల్లో హైడ్రా వ్యవహరించిన తీరుపై కూడా విమర్శలు చేశారు. రాష్ట్రంలో పేదల ఇళ్ల రక్షణ కోసం హైడ్రాను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు, హైకోర్టు ఆదేశాలను ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ స్వాగతించాయి. ప్రభుత్వం తదుపరి ఎలాంటి న్యాయపరమైన చర్యలు చేపడుతుందనే అంశం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# పారిశ్రామికాభివృద్ధి మరింత వేగం

- ఈ-సిటీ, మంఖాల్, మహేశ్వరం పారిశ్రామిక పార్కులలో సీఎస్ సంజయ్ జాజు విస్తృత పర్యటన
- పెట్టుబడులు, తయారీ సామర్థ్యం, ఉపాధి కల్పనపై సమీక్ష
- పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం



**హైదరాబాద్, జూలై 27:** రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని మరింత వేగవంతం చేయడంతో పాటు తయారీ రంగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు పేర్కొన్నారు. ఈ-సిటీ ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్, మంఖాల్ ఇండస్ట్రియల్ పార్క్, మహేశ్వరం జనరల్ పార్క్‌లలోని పలు ప్రముఖ పరిశ్రమలను ఆదివారం ఆయన సందర్శించి ఉత్పత్తి కార్యకలాపాలు, పెట్టుబడులు, ఉపాధి కల్పనపై సమీక్ష నిర్వహించారు. టీజీఐఐసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శశాంక, ప్రభుత్వ కార్యదర్శులు, టీజీఐఐసీ ఉన్నతాధికారులు ఈ పర్యటనలో సీఎస్ వెంట పాల్గొన్నారు. ముందుగా ఈ-సిటీలో 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ప్రీమియర్ ఎనర్జీస్ ఫోటోవోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించిన సీఎస్, సోలార్ పీవీ మాడ్యూల్స్ తయారీ ప్రక్రియను పరిశీలించారు. రూ.1,240 కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన ఈ సంస్థలో ప్రస్తుతం 1,200 మందికి ఉపాధి లభిస్తోందని అధికారులు వివరించారు. అనంతరం 4 ఎకరాల్లో ఏర్పాటు చేసిన అవాంటెల్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించి హైటెక్ రక్షణ ఎలక్ట్రానిక్స్, శాటిలైట్ పేలోడ్ వ్యవస్థలు, గ్రౌండ్ స్టేషన్ మౌలిక సదుపాయాల తయారీని పరిశీలించారు. రూ.59.22 కోట్ల పెట్టుబడితో ఈ సంస్థ 400 మందికి ఉపాధి కల్పిస్తోంది. తర్వాత మంఖాల్ పారిశ్రామిక పార్కులోని చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ యూనిట్‌ను సందర్శించిన సీఎస్, బీఓపీపీ, బీఓపీఈటీ ఫిల్మ్ తయారీతో పాటు కోటింగ్, మెటలైజింగ్, స్లిట్టింగ్, రీసైక్లింగ్ కార్యకలాపాలను పరిశీలించారు. రూ.284.02 కోట్ల పెట్టుబడితో నడుస్తున్న ఈ సంస్థలో 500 మందికి ఉపాధి లభిస్తోంది. అనంతరం మహేశ్వరం జనరల్ పార్కులోని విప్రో ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించిన సంజయ్ జాజు, తయారీ యూనిట్ పనితీరును పరిశీలించారు. రూ.174.34 కోట్ల పెట్టుబడితో ఈ సంస్థలో 331 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. చివరగా మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ మ్యాన్యుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్‌ను సందర్శించిన సీఎస్, అత్యాధునిక రత్నాలు, ఆభరణాల తయారీ ప్రక్రియను పరిశీలించారు. 3.7 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సంస్థ రూ.374.05 కోట్ల పెట్టుబడితో 2,782 మందికి ఉపాధి కల్పిస్తోంది. ఈ సందర్భంగా పరిశ్రమల ప్రతినిధులు, అధికారులతో సమావేశమైన సీఎస్ సంజయ్ జాజు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి పురోగతిని సమీక్షించారు. తెలంగాణ తయారీ రంగాన్ని బలోపేతం చేయడంలో, భారీ పెట్టుబడులను ఆకర్షించడంలో, ఉపాధి అవకాశాల కల్పనలో ఈ పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అభినందించారు. ప్రపంచ స్థాయి పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధికి మరింత వేగం తీసుకొచ్చేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సంజయ్ జాజు సూచించారు.



# మెట్రో ప్రయాణికులకు మెరుగైన సేవలు

## మరింత సౌకర్యవంతంగా స్టేషన్లకు రూపకల్పన

## అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 27:** హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు మరింత మెరుగైన, సౌకర్యవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్లను అన్ని విధాలా తీర్చిదిద్దేందుకు వెంటనే ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఈ మేరకు బేగంపేట్ నుంచి రాయదుర్గ్ వరకు మెట్రోలో స్వయంగా ప్రయాణించి, పలు కీలక స్టేషన్లను, అక్కడి వీధి స్థాయి వసతులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యటనలో భాగంగా బేగంపేట్, అమీర్ పేట్, రాయదుర్గ్ మెట్రో స్టేషన్లలోని ఎ÷-లాట్‌ఫామ్‌లు, కాంకోర్స్ ప్రాంతాలను అజిత్ రెడ్డి సందర్శించారు. అక్కడ ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై మెట్రో ఇంజనీర్లు , ఆపరేషన్ల నిర్వాహక సంస్థ కియోలిస్ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాయదుర్గ్ వద్ద ఉన్న స్కైవాక్, ఐటీ కంపెనీలకు ఉన్న కనెక్టివిటీ మార్గాలు , మైండ్‌స్పేస్ జంక్షన్ వద్ద ప్రయాణికుల రాకపోకలను ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మరింత పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని, అలాగే స్టేషన్ల కింద ఉన్న వాణిజ్య సముదాయాల నిర్వహణ సరిగ్గా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మెట్రో స్టేషన్ల కింద ఉన్న పార్కింగ్ స్థలాల వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, బేగంపేట్, అమీర్ పేట్, రాయదుర్గ్ పార్కింగ్ ఏరియాలను పరిశీలించి అభివృద్ధికి తగిన సూచనలు చేశారు. అలాగే, పిల్లర్ల మధ్య ఉన్న సెంట్రల్ మెరిడియన్ నిర్వహణ , పారిశుధ్య స్థితిగతులపై ఆయన సమీక్షించారు. ప్రయాణికులకు ఇచ్చే సేవలలో స్వచ్ఛత, పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నిర్వహణ చూసే ఏజెన్సీల పనితీరును ఇంకా మెరుగుపరచాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మెట్రో స్టేషన్లను మరింత మోడల్‌గా తీర్చిదిద్దేందుకు స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని అజిత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా మొదటి విడతలో 10 మెట్రో స్టేషన్లను ఎంపిక చేసి, వాటిని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే రోజుల్లో మిగిలిన అన్ని మెట్రో స్టేషన్లను కూడా స్వయంగా సందర్శించి, ప్రయాణికులకు అందే సౌకర్యాలు, పార్కింగ్, పారిశుధ్యం , భద్రతను క్రమం తప్పకుండా సమీక్షిస్తానని తెలిపారు. నగరవాసులకు అత్యంత సురక్షితమైన , ప్రశాంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడమే తమ మొదటి ప్రాధాన్యత అని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# విదేశీ యువతి పట్ల అసభ్య ప్రవర్తన

## హైదరాబాద్ టెక్కీపై పోలీసుల కేసు నమోదు

**హైదరాబాద్, జూలై 27:** కొండాపూర్ ప్రాంతంలో విదేశీ యువతి పట్ల ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన వెలుగులోకి వచ్చింది. నెదర్లాండ్స్‌కు చెందిన యువతి తన బాయ్‌ఫ్రెండ్‌ను కలిసేందుకు మార్చి నెలలో భారత్‌కు వచ్చింది. ఆ యువతి.. తన బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి నివసిస్తుండగా, అదే ఇంట్లో మరో యువకుడు ఆదిత్య ఆనంద్ ఉంటున్నాడు. అతడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బాయ్‌ఫ్రెండ్ ఇంట్లో లేని సమయంలో ఆదిత్య ఆనంద్ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించేశాడని నెదర్లాండ్స్ యువతి ఆరోపణలు చేసింది. యువకుడి చేష్టలతో విసిగిపోయిన యువతి.. భారత్ నుంచి తిరిగి నెదర్లాండ్స్‌కు వెళ్లి అక్కడి ఎంబసీకి ఫిర్యాదు చేసింది. 3రోజుల క్రితం యువతి తిరిగి హైదరాబాద్‌కు వచ్చింది. జరిగిన విషయాలన్నింటినీ గచ్చిబౌలి పోలీసులకు వివరించింది. యువతి ఫిర్యాదు ఆధారంగా ఆదిత్య ఆనంద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ప్రస్తుతం యువకుడు పరారీలో ఉన్నాడు. యువకుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం

## రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టు: ఆర్ఎస్

**హైదరాబాద్, జూలై 27:** వరుస వివాదాల నేపథ్యంలో హైకోర్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలని చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేయడంపై బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. ఇది ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. రంగనాథ్ మీదున్న 63 కోర్టు ధిక్కరణలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఉన్నత న్యాయ స్థానం ఇన్ని ఉల్లంఘలనకు పాల్పడుతున్న అధికారిని ఇంకా కొనసాగిస్తే రూల్ ఆఫ్ లా అదుపు తప్పుతుందని, రంగనాథ్ స్థానంలో ఐజీ స్థాయి అధికారిని నియమించాలని హైకోర్టు తెలిపిందన్నరు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డికి చెంపదెబ్బలాంటిదన్నారు. రేవంత్ రెడ్డికి ఏ మాత్రం కూడా తెలంగాణను పరిపాలించే నైతిక అర్హత లేదని సోమవారం హైకోర్టు ఇచ్చిన తీర్పు ద్వారా తేలిపోయింది. లక్షమంది పోలీసులున్న ఈ రాష్ట్రంలో హోంమంత్రి అయిన సిఎం హైకోర్టు స్థానిక పోలీసులెవరూ కూడా తెలంగాణ ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడలేరు. అందుకు ఆర్మీ అధికారులను ఆదేశించింది.. అంటే అసలు మీకు ఇక నైతిక హక్కు ఎక్కడుందని ప్రశ్నించారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేతల ప్రభుత్వం. విధ్వంసకర ప్రభుత్వం. లగచర్లలో, వెలుగుమట్లలో నాశనం చేశారు. సున్నం చెరువు పేరుతో, బహదూర్ గూడ పేరుతో, లోతుకుంటలో ఎక్కడ చూసినా విధ్వంసమే. ఆ విధ్వంసం చేస్తూనే మరోవైపు పేదల భూములను మీ సొంత సోదరులు, మీ కాంగ్రెస్ పార్టీ నాయకులంతా కబ్జాలు చేస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. హైడ్రాను అడ్డం పెట్టుకుని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూభారతి పోర్టల్‌ను తీసుకొని దొడ్డి దారిన దాదాపు 22 వేల ఎకరాల భూముల హక్కులను రాత్రికి రాత్రే ఎమ్మార్వో, ఆర్డీవోల సంతకాలు లేకుండా బదలాయించారు. కోర్టులు ఇచ్చిన ఆదేశాలను దయచేసి అతిక్రమించకండని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కోరారు.

## సంపాదకీయం



# వ్యవస్థల వైఫల్యం

## రగులుతున్న యువత ఆగ్రహం!

### జవాబుదారీతనం కరువైతే ప్రజా ఉద్యమాలు తప్పవు

దేశంలో యువత తక్షణ స్పందన కోరుకుంటోంది. సమస్యలపై తక్షణ చర్యలను కోరుతోంది. రాజకీయ నాయకులు లేదా పాలకులు సమస్యలపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతు న్నారు. కావాలనే తాత్సారం చేస్తున్నారు. దీంతో ప్రజల్లో తీవ్ర నిరాశా, నిస్పృహలు ఉన్నాయి. ఏ సమయంలో చేయాల్సిన పనిని అప్పుడే చేయడం లేదు. నాన్చివేత ధోరణి కారణంగా దేశం అడుగు ముందుకు వేయడం లేదు. జిఎస్టీని తీసుకుని వచ్చి గొప్పలు చెప్పారు. ప్రజలు దీనికి బలవుతున్నా పట్టించుకోలేదు. ఇప్పుడు జిఎస్టీ శ్లాబ్‌లను తగ్గించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఆహార ధరలు పెరుగుతున్నా పట్టింపు లేదు. మందుల మాఫియాను అరికట్టడం లేదు. అవినీతి వేళ్లూనుకుని పోయింది. అయినా పట్టించుకోవడం లేదు. ఇలా ఒకటేమిటి అనేకానేక సమస్యలు ఉన్నాయి. ఇవన్నీ పట్టించుకోక పోవడం వల్లనే ..నీట్ పేపర్ లీక్ తరవాత యువత ఉద్యమించింది. ఇది మొదలూ కాదు..అంతం కూడా కాదని పాలకులు గుర్తించాలి. ఇంతటితో ఇక పీడ విరగడ అయ్యిందని పాలకుల భావిస్తే అంతకుమించి మూల్యం చెల్లించుకో తప్పదు. యువత బొద్దింకలుగా మారి దేశ రాజధాని ఢిల్లీని చుట్టుముట్టే పరిస్థితి ఎందుకొచ్చిందని ఆత్మపరిశీలన చేసుకోవాలి. పార్లమెంట్ జరుగుతోంది. అయినా సమస్యలపై చర్చించడం లేదు. ఆరోరోజు కూడా విపక్షాలు ప్రధాని మోడీ, అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ సభాసమయాన్ని వృధా చేస్తున్నాయి. ఇది ప్రజల సమయం, ప్రజలు ఇచ్చిన అధికారం అని గుర్తించాలి. ఇలాగే చేస్తూ పోతే..పార్లమెంటులో గబ్బిలాల్లా ఏళ్ల తరబడి పట్టుకుని వేళ్లాడుతున్న నేతలను కూడా తొలగించడానికి ఉద్యమించక తప్పదేమో. ప్రశ్నపత్రాలు లీక్ కావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో అనేక సందర్భాలలో జరిగాయి. దశాబ్దాల క్రితం ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మంత్రులు రాజీనామా చేసిన ఉదంతాలు కూడా ఉన్నాయి. కానీ ఇప్పుడే ఎందుకింత ఉద్యమం జరిగిందంటే కారణం యువతలో ఉన్న ఆక్రోశమని గుర్తించాలి. నాయకుల తీరుపట్ల ప్రజల్లో, ముఖ్యంగా యువతలో నిరాశా నిస్పృహలు పెరిగిపోతున్నాయని గ్రహించాలి. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే మూల స్తంభాలు తమ బాధ్యతల నుంచి దూరం జరగడం కూడా ప్రస్తుత దుస్థితికి కారణం.చట్టసభల్లో సమస్యలపై చర్చించి, వాటికి పరిష్కారం చూపడం లేదు. అసలు సమస్యలనే గుర్తించడం లేదు. ఇకవాటిపై చర్చల గురించి ఆలోచన తరవాత. ప్రధాన ప్రతిపక్షం సమస్యలపై చర్చ చేయకుండా సభను స్తంభింప చేయడం మాత్రమే చేస్తోంది. అధికార పక్షం ప్రజల సమస్యలకు జవాబు ఇవ్వంద లేదు. కేవలం తమ స్వప్రయోజనాల కోసం పార్లమెంటును నడపుతున్నారా అన్న భావన కులుగుతోంది. బొద్దింకలు చేపట్టిన ఆందోళన విరమణతో ప్రస్తుత సమస్య తాత్కాలికంగా సమసిపోతే పోవచ్చు. కానీ ప్రధాన వ్యవస్థలు తమ బాధ్యతను గుర్తించి మెలగని పక్షంలో మరో సమస్య వచ్చినప్పుడు ఆందోళనలు ఇంతకు మంచి ఊపందుకుంటాయి. మన దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉన్నందువల్లే మనం స్వేచ్ఛగా జీవించగలుగుతున్నాం. దానిని బలహీనపరచడమంటే ప్రజాస్వామ్యం మనుగడే ప్రమాదంలో పడుతుంది. వ్యవస్థలకు వ్యతిరేకంగా కాకుండా వాటిల్లో జవాబుదారీ తనాన్ని తీసుకురావడానికి పోరాడవలసిన సమయం ఇప్పుడు ఆసన్నమైంది. కాక్రోచ్ జనతా పార్టీ కోరుతున్నది అదే కనుక నేతలు తమ పద్ధతిని మార్చుకుంటే మంచిది. ముఖ్యంగా రాజకీయ పార్టీలు కూడా ఇప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఒక సామాన్యుడైన అభిజీత్ దీప్కే ప్రారంభించిన కాక్రోచ్ జనతా పార్టీ వెనుక నిలబడడం ద్వారా కాంగ్రెస్ తదితర పార్టీలు ఓ రకంగా తమ ఉనికిని కోల్పోయానే చెప్పాలి. వారు చేయాల్సిన పనిని వారి పార్టీలు చేయలేకపోయాయి. ఈ దుస్థితి ఎందుకొచ్చిందో రాజకీయ పార్టీలు ప్రశ్నించుకోవాలి. సామాన్య ప్రజలు చేపట్టిన ఆందోళనకు దిగి రావాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందో పాలకులు కూడా గ్రహించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలను, ప్రత్యర్థులను భయపెడుతూ ఎంతో కాలం మనుగడ సాగించలేమని పాలకులు గుర్తించాలి. ప్రజాస్వామ్యం మౌలిక సూత్రాలను ఆచరించి అమలు చేస్తామన్న నమ్మకాన్ని పాలకులు ప్రజల్లో కల్పించాలి. . పరిస్థితి చేయి దాటిపోతోందని గ్రహించిన తరవాతనే కేంద్ర ప్రభుత్వ పెద్దలు అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకున్నారు. సోషల్ మీడియా ఇంతలా విస్తరించిన ఈ కాలంలో ఏ విషయాన్ని కూడా దాచిపెట్టలేమని ప్రభుత్వాలు, ప్రధాన పార్టీలు గుర్తించాలి. ముఖ్యంగా యువతలో పేరుకుపోతున్న నిరాశా నిస్పృహలకు సమాధానం చెప్పాలి. పార్లమెంటులో ఎప్పటికప్పుడు ప్రధాన సమస్యలపై అర్థవంతమైన చర్చలు సాగాలి. సమస్యలు పరిష్కారం అయ్యేలా తక్షణ చర్యలకు పూనుకోవాలి. దాశాబ్దాలుగా సమస్యలను నానపెడుతూ మరిని కొత్త సమస్యలకు కారణం కారాదు. అలాగే పాలకలు విలాసాలు వీడాలి. ప్రజల సొమ్మకు జవాబుదారీ తనాన్ని అలవర్చుకోవాలి. జల్సాలు చేసేందుకు చేసే ప్రయత్నాలను ఇప్పటికైనా ముగించాలి. లేదంటే ఏ చిన్న సంఘటన జరిగినా ఆందోళనలు మరింత ఉదీథంగా పుట్టుకురావొచ్చు. ఇప్పుడున్న నేతలు ఎవరినీ ప్రజలు ఎవరినీ నమ్మలేని పరిస్థితి ఏర్పడుతోంది. దానిని అధిగమించకపోతే పాలకులకు ఎదురుదెబ్బలు తప్పవు..

# లోక్‌సభలో పేపర్ లీకేజీ సవరణ బిల్లు

- పార్లమెంట్‌లో కొనసాగిన ప్రతిష్ఠంభన
- మోడీ, అమిత్ షా క్షమాపణలకు విపక్షాల డిమాండ్

**న్యూఢిల్లీ, జూలై 27:** పార్లమెంట్ ఉభయసభల్లో సోమవారం కూడా ప్రతిష్ఠంభన కొనసాగింది. విద్యార్థులపై నమోదైన కేసులు ఎత్తివేయాలని, నిరసనకారులపై జరిగిన లాఠీచార్జీ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ విపక్ష సభ్యులు ఉభయసభల్లో ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో సభల్లో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో లోక్‌సభ, రాజ్యసభలను పలుమార్లు వాయిదా వేశారు. గందరగోళం మధ్యే కేంద్ర ప్రభుత్వం యాంటీ పేపర్ లీక్ (సవరణ) బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బిల్లును సభ ముందుంచారు. బిల్లు ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని దీనిపై చర్చకు స్పీకర్ ఓం బిర్లా అనుమతి ఇచ్చారు. అయితే విపక్ష సభ్యులు తమ నిరసన కొనసాగించడంతో చర్చ ప్రారంభం కాలేదు. అనంతరం సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. నీట్, యూజీసీ-నెట్ సహా పలు పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం



చేయడమే లక్ష్యంగా కేంద్రం ఈ సవరణ బిల్లును తీసుకొచ్చింది. ప్రస్తుతం అమల్లో ఉన్న 2024 చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ నిందితులకు గరిష్ఠంగా 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ప్రతిపాదనలు చేసింది. ప్రస్తుతం ఉన్న చట్టంలో గరిష్ఠ శిక్ష ఐదేళ్లు, జరిమానా రూ.10 లక్షల వరకు మాత్రమే ఉంది. పేపర్ లీకేజీ కేసుల దర్యాప్తు కోసం ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) ఏర్పాటు చేయాలని బిల్లులో ప్రతిపాదించారు. కేసు నమోదు అయిన తర్వాత రెండు నెలల్లో దర్యాప్తు పూర్తి చేయాలని, అనంతరం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో రోజువారీ విచారణ నిర్వహించి 90 రోజుల్లో తీర్పు వెలువరించాలని నిబంధనలు రూపొందించారు. హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసుకునేందుకు 30 రోజుల గడువు, అప్పీల్‌పై కూడా 90 రోజుల్లో తీర్పు ఇవ్వాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, ప్రశ్నపత్రాల లీకేజీలకు పూర్తిగా అడ్డుకట్ట వేయడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్రం పేర్కొంది. ఈ దిశగా సాంకేతిక సంస్కరణలు, పరీక్షల భద్రతపై సిఫార్సులు చేసేందుకు నందన్ నీలేకణి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేసింది. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ)లో పలు పరిపాలనా మార్పులు కూడా చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే ఈ బిల్లును విపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. సమస్య మూలాలను పరిష్కరించకుండా పైపై చర్యలకే ప్రభుత్వం పరిమితమైందని ఆరోపించాయి. విద్యార్థులపై లాఠీచార్జీ ఘటనకు బాధ్యత వహిస్తూ ప్రభుత్వం సమాధానం చెప్పాలని, సంబంధిత ఘటనపై ప్రధాని మోదీ, అమిత్ షా క్షమాపణ చెప్పాలని విపక్షాలు మరోసారి డిమాండ్ చేశాయి. దీంతో పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన కొనసాగింది.

# విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందే

- ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ డిమాండ్

**న్యూఢిల్లీ, జులై 27 :** దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేత ధోరణిని అవలంబిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మండిపడ్డారు. విద్యార్థులపై కాల్పులు, లాఠీఛార్జీలు, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆగ్రహించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇందుకు క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. బిహార్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఏకే-47తో కాల్పులు జరిపారని, వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేసి వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారనే వార్తలు వస్తున్నాయని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులపై ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమని, వారిని విడుదల చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. హామీకి విరుద్ధంగా వారిపై క్రూరమైన దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఢిల్లీలో విద్యార్థులపై పెల్లెట్ గన్‌లు ప్రయోగించారని, బిహార్‌లో ఏకే-47తో కాల్పులు జరిగాయని రాహుల్ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బిహార్, ఢిల్లీ.. రాష్ట్రం ఏదైనా విద్యార్థుల గొంతు నొక్కివేయాలనే ధోరణెళి కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం నిజాయతీ లేనిదని తాను గతంలోనే చెప్పానని, నిజమైన సంస్కరణలు తీసుకురావడం ఈ ప్రభుత్వానికి సాధ్యం కాదని రాహుల్ విమర్శించారు. ఇచ్చిన హామీల నుంచి వెనక్కి తగ్గడంతో పాటు, విద్యార్థుల గొంతు అణచివేసేందుకు అన్ని మార్గాలను ఉపయోగిస్తోందని చెప్పుకొచ్చారు. దేశంలోని విద్యార్థులందరికీ ప్రధాని మోదీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు. విద్యార్థులపై కేసులు పెట్టడం కాకుండా, వారిపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ డిమాండ్



చేశారు. కాగా, జులై 25న బిహార్ బంద్ సందర్భంగా సివాన్ జిల్లాలో పోలీసులు ఏకే-47తో కాల్పులు జరిపినట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఓ పోలీసు అధికారిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

## శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ఉంది

### ఇది ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం ఇచ్చిన భరోసా

### చీఫ్ జస్టిస్ జస్టిస్ సూర్యకాంత అభిప్రాయం



**న్యూఢిల్లీ, జూలై 27:** నీట్ పేపర్ లీక్ కేసుకు సంబంధించి విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పిస్తుందని, కేవలం నిరసన వ్యక్తం చేస్తున్నారనే కారణంతో పోలీసు బలప్రయోగానికి పాల్పడకూ డదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జూలై 20న 'సంసద్ చలో' కార్యక్రమంలో భాగంగా నీట్ పేపర్ లీక్ కేసుపై న్యాయం కోరుతూ విద్యార్థులు నిర్వహించిన నిరసన సందర్భంగా పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనపై స్వతంత్ర విచారణ జరపాలని కోరుతూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు రాజ్యాంగబద్ధ హక్కులపై కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పౌరులకు కల్పించిందని పేర్కొంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ అభిప్రాయాలను శాంతియుతంగా వ్యక్తం చేసే స్వేచ్ఛ ప్రతి పౌరుడికి ఉందని స్పష్టం చేసింది. అలాగే, కేవలం నిరసన జరుగుతోందనే కారణంతోనే లాఠీచార్జ్ లేదా బలప్రయోగాన్ని సమర్థించలేమని కోర్టు వ్యాఖ్యానించింది. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగంపై స్వతంత్ర విచారణ జరపాలని పిటిషనర్లు కోరారు. ఈ ఘటనలో పోలీసులు అనుసరించిన విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత నిరసనలు ప్రజల ప్రాథమిక హక్కుల్లో భాగమని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు ఒక ప్రజాస్వామ్య మార్గమని, అలాంటి సందర్భాల్లో చట్టాన్ని అమలు చేసే సంస్థలు కూడా రాజ్యాంగబద్ధ హక్కులను గౌరవిస్తూ వ్యవహరించాలని అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు నిరసన హక్కు, పోలీసుల చర్యల పరిమితులపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి.

# కేంద్రం హామీలు బుట్టదాఖిలు

### కేసుల ఉపసంహరణపై కదలిక లేదు ■ మళ్లీ దేశవ్యాప్త ఆందోళనలకు సీజేపీ హెచ్చరిక

### విద్యార్థులకు న్యాయసాయం కోసం 'సాక్షి' ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభం

**న్యూఢిల్లీ, జూలై 27:** నిరసనకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకుంటామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని 'కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)' ఆరోపించింది. హామీలను అమలు చేయకపోతే దేశవ్యాప్తంగా మరోసారి ఆందోళనలు ప్రారంభిస్తామని హెచ్చరించింది. పేపర్ లీక్ ఘటనపై జరిగిన నిరసనల అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తర్వాత సీజేపీ తమ ఆందోళనను విరమించింది. కేంద్రంతో జరిగిన చర్చల్లో విద్యార్థులపై నమోదైన కేసులను ఎత్తివేస్తామని హామీ ఇచ్చారని పార్టీ ప్రతినిధులు తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు కనిపించడం లేదని విమర్శించారు. సీజేపీ ప్రతినిధి అశుతోష్ రాంకా ఎక్స్ వేదికగా స్పందిస్తూ, ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం లేదని ఆరోపించారు. బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేస్తున్నారని, ఢిల్లీతో పాటు ఇతర రాష్ట్రాల్లో నిరసనకారులపై నిఘా పెట్టి వేధింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఉద్యమానికి లాజిస్టిక్ సహాయం చేసిన వాలంటీర్లను కూడా లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, కేసుల్లో చిక్కుకున్న విద్యార్థులకు న్యాయ సహాయం అందించేందుకు 'సాక్షి' పేరుతో ప్రత్యేక ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా నిరసనకారులపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని, అదుపులో ఉన్న విద్యార్థులను విడుదల చేయాలని, వాలంటీర్లపై నిఘా, వేధింపులు నిలిపివేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అస్సాం, బీహార్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో పలువురు ఆందోళనకారులను అరెస్టు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ కేసులపై న్యాయవాదులతో సంప్రదింపులు జరుపుతున్నామని సౌరవ్ దాస్ తెలిపారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ ఈ అంశంలో తక్షణం జోక్యం చేసుకోవాలని కోరారు. రేపటిలోగా దేశవ్యాప్తంగా నిరసనకారులపై నమోదైన అన్ని కేసులను ఉపసంహరించుకోవడంతో పాటు, నిర్బంధంలో ఉన్న వారిని విడుదల చేయాలని సీజేపీ డిమాండ్ చేసింది. బీజేపీ పాలిత రాష్ట్రాలు, ఢిల్లీ పోలీసులు లేదా కేంద్ర దర్యాప్తు సంస్థలు కొత్త కేసులు నమోదు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరింది. లేదంటే తదుపరి కార్యాచరణ ప్రకటించి మళ్లీ దేశవ్యాప్త ఆందోళనలకు దిగుతామని అల్టిమేటం జారీ చేసింది. సోమవారం సీనియర్ సుప్రీంకోర్టు న్యాయవాది, సమాజ్‌వాదీ పార్టీ రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో సౌరవ్ దాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించడంతో జూలై 25న ఆందోళనను విరమించుకున్నామని, అయితే ఆందోళన తగ్గిన తర్వాత విద్యార్థులను ఒక్కొక్కరిగా లక్ష్యంగా చేసుకుంటారనే అనుమానం తమకు ముందే ఉందని వ్యాఖ్యానించారు.



# అబ్దుల్ కలాం ఆశయాలు యువతకు ఆదర్శం

- రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా 11వ వర్ధంతి సభ: కలాం విగ్రహావిష్కరణకు భూమిపూజ




ఆలేరు, జూలై 27 :

భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 11వ వర్ధంతిని పురస్కరించుకుని రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఆలేరు పట్టణంలో ఘనంగా నిర్వహించిన స్మారక సభలో పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వక్తలు మాట్లాడుతూ భారతదేశాన్ని విజ్ఞాన శక్తిగా తీర్చిదిద్దేందుకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విశేష కృషి చేశారని కొనియాడారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా, గొప్ప ఉపాధ్యాయుడిగా కోట్లాది మంది యువతకు స్ఫూర్తిగా నిలిచిన మహనీ యుడని పేర్కొన్నారు. కలలు కనండి, ఆ కలలను లక్ష్యాలుగా మార్చుకుని కష్టపడి సాధించండి అనే ఆయన సందేశం నేటి విద్యార్థులు, యువతకు మార్గదర్శకమని అన్నారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని, విద్య, క్రమశిక్షణ, దేశభక్తితో ముందుకు సాగితేనే కలాం కలల భారతాన్ని నిర్మించగలమని అభిప్రాయ పడ్డారు. అబ్దుల్ కలాం ఆశయస్ఫూర్తితో ఎందరో ఈనాడు అన్ని రంగాలలో అద్భుతాలు సృష్టిస్తున్నారని, ఇటీవల స్కై రూటు అంతరిక్ష వాహనం రూపొందించిన వారు కూడా ఆయన స్ఫూర్తిగా తీసుకున్న విద్యార్థులేనని గుర్తు చేశారు. అనంతరం రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణకు భూమిపూజ నిర్వహించారు. అక్టోబర్ 10న జరిగే కలాం జయంతి నాటికి విగ్రహ నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ విగ్రహం యువతకు స్ఫూర్తి కేంద్రంగా నిలిచేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పులిప లుపుల మహేష్, మంగ నరసింహులు, మూడో వార్డు కౌన్సిలర్ యాట శివ, నాలుగో వార్డు కౌన్సిలర్ బీజని కళ్యాణి, మాజీ వార్డు సభ్యులు పంతం కృష్ణ, జింకల రామకృష్ణ, మోతి వెంకటేష్, మాజీ ఎంపీటీసీ కట్టే గుమ్మల సాగర్ రెడ్డి, జర్నలిస్టులు ఎండి కుర్షద్ పాషా, ఎర్ర జాన్సన్, ప్రజా సంఘాల నాయకులు కంతుల శంకర్, ఏలుగుల వెంకటేష్, ఎండి ఫయాజ్, పడగంటి చందు, మైదము భాస్కర్, పేరపు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య సమస్య పరిష్కారానికి దొనకొండ లాస్య చొరవ

- స్వంత నిధులతో డోజర్ ఏర్పాటు చేసి రోడ్డు చదును చేసిన కాంగ్రెస్ మహిళా నాయకురాలు లాస్య కృష్ణ

ఆలేరు, జూలై 27 :

ఆలేరు పట్టణం 1వ వార్డులో నెలకొన్న పారిశుధ్య సమస్యపై సమాచారం అందిన వెంటనే స్పందించిన కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు దొనకొండ లాస్య కృష్ణ స్వంత నిధులతో డోజర్‌ను ఏర్పాటు చేసి రోడ్డు చదును చేయించారు. పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న మహేందర్ శర్మ నివాసం ఆవరణలో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో పాములు, తేళ్లు ఇంట్లోకి వస్తుండటంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని లాస్య కృష్ణ దృష్టికి తీసుకురాగానే ఆమె వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ స్థానిక వార్డు కౌన్సిలర్ ఎన్నికై ఆరు నెలలు గడిచినా ఇప్పటి వరకు తమ ప్రాంతాన్ని ఒక్కసారి కూడా సందర్శించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో వార్డులో కోతుల సమస్య పరిష్కరిస్తామని, వాగులో చెత్త వేయకుండా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా, వాటి అమలుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని



విమర్శించారు. అదే సమయంలో ఆలేరు పట్టణ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బీజని బాలమణి భాస్కర్పై నిరాధార ఆరోపణలు చేయడం మానుకుని, వార్డు అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రజలు సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మహేందర్ శర్మ, పుల్లూరు వినోద్, కాంగ్రెస్

# దౌల్తాబాద్, దుద్యాల మండలాల్లో విత్తన మేళా

- ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన
- దౌల్తాబాద్, ఏవో దుద్యాల మండల ఇంచార్జి జి.తులసి




దౌల్తాబాద్ మండలం,జులై,27

దౌల్తాబాద్, దుద్యాల మండలాల రైతు వేదికల్లో సోమవారం,వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళా (Seed Mela) తో పాటు ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ (Contingency) పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారి జి.తులసి మాట్లాడుతూ,, ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ వానాకాలంలో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు స్థానిక పరిస్థితులు, భూసారం, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో దుద్యాల మండలంలో మండల వ్యవసాయ అధికారి తులసి, ఉద్యాన అధికారి సురేంద్రనాథ్, వ్యవసాయ విస్తరణ అధికారులు కావ్య, బాబు, ఆయిల్ ఫామ్ ఫీల్డ్ ఆఫీసర్స్, విత్తన డీలర్ ఫరీద్ మరియు రైతులు పాల్గొన్నారు.దౌల్తాబాద్ మండలంలో ఏఈవోలు వైష్ణవి, నిఖిల్, లోకేష్, విత్తన డీలర్లు మరియు రైతులు పాల్గొన్నారు

# వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి:

జిల్లా కలెక్టర్ కే. హైమావతి సిద్దిపేట, జూలై 27,

ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. రెండు రోజుల్లో మండల స్థాయి సమావేశాలు నిర్వహించి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రైతులకు మెట్ట పంటలపై అవగాహన కల్పించి, వ్యవసాయ భూములు ఖాళీగా ఉంచకుండా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని, ఆయిల్ పామ్ సాగు ప్రయోజనాలను వివరించాలని చెప్పారు. ప్రతి గ్రామపంచాయతీలో 100 ఫామ్ పాండ్లు, పెర్కొలేషన్ పాండ్లు, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలు, సోక్ పిట్లు, ప్రభుత్వ భవనాల్లో రూఫ్‌టాప్ రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను శాతం 100 ఏర్పాటు చేయాలని ఆదేశించారు. త్రాగునీటికి జిల్లాలో ప్రస్తుతం ఇబ్బంది లేదని, బెజ్జంకి, హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలకు ప్రత్యేక తాగునీటి కార్యాచరణ అమలులో ఉందని, విద్యుత్ సరఫరాపైనా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. భూగర్భ జలాల సంరక్షణకు మండల ప్రత్యేక అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె పిలుపునిచ్చారు.




# తెలంగాణ–ఉత్తరప్రదేశ్ శాసనసభల నిర్వహణపై ఇరు రాష్ట్రాల స్పీకర్ల చర్చ



హైదరాబాద్ జూలై27

ఉత్తరప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ శ్రీ సతీష్ మహానా, వారి సతీమణి శ్రీమతి అనితా మహానా సోమవారం తెలంగాణ రాష్ట్ర శాసనసభను సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ ఉత్తరప్రదేశ్ స్పీకర్ దంపతులకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జ్ఞాపికను అందజేసి సత్కరించారు. తదనంతరం అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో సమావేశమైన తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ శ్రీ సతీష్ మహానా ఇరు రాష్ట్రాల శాసనసభల నిర్వహణ, శాసన ప్రక్రియ, సభా నిర్వహణలో అనుసరిస్తున్న విధానాలు, ప్రజాస్వామ్య సంప్రదాయాల పరిరక్షణ తదితర అంశాలపై స్నేహపూర్వకంగా చర్చించారు. శాసనసభల పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే అంశాలపై పరస్పరం అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సమావేశంలో తెలంగాణ శాసనమండలి కార్యదర్శి డా. వి. నరసింహాచార్యులు, తెలంగాణ శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అవసరమైతే దీనిని ఐ&పీఆర్ (I&PR) విడుదల చేసే అధికారిక ప్రెస్ నోట్ ఫార్మాట్‌లో కూడా సిద్ధం చేయగలను.

# మాతృ యోగానికి గురైన పట్నం సోదరులను పరామర్శించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.



షాబాద్ మండలం, జులై,27

తల్లి పట్నం రుక్కమ్మ మృతి నేపథ్యంలో
శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, మనుమడు షాబాద్ మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి లను షాబాద్ లోని ఇంటికి చేరుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట నాయకులు నర్సింగ్ రావు,కోట్ల మహిపాల్, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకంతో రైతులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



మెదక్, జూలై 27

తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకం ద్వారా రైతులు, నిరుద్యోగ యువత, మహిళలు తక్కువ పెట్టుబడితో అదనపు ఆదాయం పొందుతూ పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. కౌడిపల్లి మండల కేంద్రంలో రైతు మహిపాల్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో సబ్సిడీలు, శిక్షణా కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయని, తేనె, పుట్టగొడుగుల ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నందున రైతులు యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తేనెటీగల పెంపకం, పుట్టగొడుగుల సాగు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం అందించే కుటీర పరిశ్రమలని పేర్కొంటూ, ప్రభుత్వ సబ్సిడీలు, శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన పట్టు పరిశ్రమ అధికారి ప్రతాప్ సింగ్, డీఆర్డీఓ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఫారాల స్వీకరణ వేగవంతం చేయాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్, జూలై 27:



ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణను వేగవంతం చేసి, గడువులోగా 100 శాతం డిజిటైజేషన్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఫారాలు తీసుకున్న ఓటర్లు వాటిని పూర్తిగా నింపి వెంటనే బీఎల్ఓలకు అందజేయాలని, ఇంకా సమర్పించని వారు ఆలస్యం చేయకుండా ఫారాలు ఇవ్వాలని సూచించారు. ఫారాలు సమర్పించని వారి పేర్లు ముసాయిదా ఓటరు జాబితాలో నమోదు కాకపోవచ్చని, దీంతో ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, తప్పులు లేకుండా, నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు ప్రజలు అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

# పట్నం కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే మాధవరం,ఎమ్మెల్సీ శంబీపూర్

షాబాద్ మండలం, జులై 27

పట్నం మహేందర్ రెడ్డి కుటుంబాన్ని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు లు పరామర్శించారు.డాక్టర్. పట్నం మహేందర్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డిల తల్లి రుక్కమ్మ మృతి చెందిన నేపథ్యంలో షాబాద్ లోని వారి నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.వారితో పాటు పట్నం అవినాష్ రెడ్డి, కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.రుక్కమ్మ పవిత్ర ఆత్మకు భగవంతుడు శాంతిని ప్రసాదించాలని కోరారు. కూకట్పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, కొలన్ ప్రభాకర్ రెడ్డి, పూడూరు మాజీ జెడ్పీటీసి సత్యనారాయణ రెడ్డి, నర్సింగ్ రావు, ధర్మారెడ్డి , బాలకృష్ణారెడ్డి తదితరులు వారితో ఉన్నారు



చురకలు



## జర్మనీలో ఉద్యోగాల కోసం నర్సింగ్, ఫిజియోథెరపీ అభ్యర్థులకు ఉచిత జర్మన్ భాషా శిక్షణ

**ఖమ్మం, జూలై 27 :**

ఉమ్మడి ఖమ్మం జిల్లా నర్సింగ్, ఫిజియోథెరపీ కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులకు జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కార్యాలయం టామ్‌కామ్ ఆధ్వర్యంలో త్వరలో ఉచిత జర్మన్ భాషా శిక్షణ ప్రారంభించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి తెలిపారు. శిక్షణ అనంతరం అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి జర్మనీలో ఉద్యోగాల కోసం షరతులతో కూడిన ఉద్యోగ ఎంపిక ధ్రువీకరణ పత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఖమ్మం కలెక్టరేట్ మొదటి అంతస్తులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.


## జర్మనీలో ఉద్యోగాల కోసం నర్సింగ్, ఫిజియోథెరపీ అభ్యర్థులకు ఉచిత జర్మన్ భాషా శిక్షణ

**ఖమ్మం, జూలై 27 :**

ఉమ్మడి ఖమ్మం జిల్లా నర్సింగ్, ఫిజియోథెరపీ కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులకు జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కార్యాలయం టామ్‌కామ్ ఆధ్వర్యంలో త్వరలో ఉచిత జర్మన్ భాషా శిక్షణ ప్రారంభించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి తెలిపారు. శిక్షణ అనంతరం అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి జర్మనీలో ఉద్యోగాల కోసం షరతులతో కూడిన ఉద్యోగ ఎంపిక ధ్రువీకరణ పత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఖమ్మం కలెక్టరేట్ మొదటి అంతస్తులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.


## సిద్దిపేట రైతులకు కీలక ప్రకటన

### 27 నుంచి 29 వరకు ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళా

**సిద్దిపేట, జూలై 27:**



సిద్దిపేట జిల్లాలోని రైతుల కోసం ఈ నెల 27, 28, 29 తేదీల్లో జిల్లాలోని 26 మండలాల్లోని ఒక్కో రైతు వేదికలో ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రకటించింది.

మేళాలో చిరుధాన్యాలు (జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు), పప్పుధాన్యాలు (కందులు, మినుములు, పెసర, బొబ్బర్లు), నూనెగింజల పంటలు (పొద్దుతిరుగుడు, నువ్వులు, ఆముదం) తదితర నాణ్యమైన ధృవీకరించిన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంటాయి. ప్రస్తుత నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు ఈ మేళా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రైతులు తమ మండలంలోని రైతు వేదికలో జరిగే విత్తన మేళాలో పాల్గొని నాణ్యమైన విత్తనాలను పొందాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం విజ్ఞప్తి చేసింది.

## పింఛన్ దారులు దివ్యాంగులు, వయోవృద్ధులకు టిఫిన్ తాగు నీరు ఏర్పాటు చేసిన కౌన్సిలర్

**కొడంగల్ మున్సిపల్,27**



కొడంగల్ మున్సిపల్ 2వ వార్డు కౌన్సిలర్ ఆర్. వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ తండ్రి కీర్తిశేషులు ర్యాలపేట రాములు జ్ఞాపకార్థం కొడంగల్ మున్సిపల్ రెండవ వార్డ్ లో పోస్ట్ ఆఫీస్ దగ్గర పింఛన్ కోసం వచ్చిన దివ్యాంగులు,వయోవృద్ధులు, వితంతువులకు టిఫిన్, తాగు నీరు ఏర్పాటు చేసిన కొడంగల్ మున్సిపల్ రెండవ వార్డ్ కౌన్సిలర్ ఆర్.వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ దంపతులు. ఈ కార్యక్రమంలో అవుసుల పరమేష్. బుక్క శివ. కేపీ.శివ, బుక్క శ్రీకాంత్. బాపన్ గేరి మోహన్, కటిక మహేష్, హోటల్ చిన్న, మంగలి శేఖర్, కొక్కల చందు, సల్కంపేట మోహన్, బండి గోపాల్, శివారెడ్డి, బాకారం బాల్రెడ్డి, తండ్ర గౌరీ శంకర్, పాశం సత్యప్ప.దుద్యాల శ్రీను, కేపీ రాకేష్,దుద్యాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**హైదరాబాద్, జూలై 27**

ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదును నిర్దేశిత గడువులోగా పారదర్శకంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 88 వినతులను స్వీకరించారు.అనంతరం ఆర్డీవోలు, తహసీల్దార్లు, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ప్రాధాన్యత ఆధారంగా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవో, డిప్యూటీ కలెక్టర్‌తో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**హైదరాబాద్, జూలై 27 :**

ప్రజావాణికి వచ్చిన ప్రతి ఫిర్యాదును నిర్దేశిత గడువులోగా పారదర్శకంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 88 వినతులను స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రతి దరఖాస్తుపై బాధ్యతాయుతంగా చర్యలు తీసుకుని, ప్రజల సమస్యలను ప్రాధాన్యతతో త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

# ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికాపై రైతులకు అవగాహన

**ఏ ఈ ఓ తిరుపతి**

**గుండుమాల్ మండలం, జులై,27**



గుండుమాల్ మండలంలోని కొమ్మూర్ గ్రామం లో సోమవారం ప్రత్యేక గ్రామసభ లో పాల్గొనడం జరిగింది. వ్యవసాయ విస్తరణ అధికారి కే.తిరుపతి రైతులను ఉద్దేశించి ఎల్‌నినో ప్రభావం మరియు ప్రత్యామ్నాయ (Contingency) పంటల ప్రణాళికపై రైతులకు వరి కి బదులు ఆరుతడి పంటలు పండించాలని అవగాహన కల్పించారు. అలాగే నీటి సంరక్షణ, భూగర్భజలల పెంపు , కరువు నివారణ వంటివి జలసిరి పథకం లో భాగంగా రైతులు ఫారం పాండ్స్, బోర్వెల్ రీచార్జ్ నిర్మాణాలు చేపట్టాలని గ్రామసభ లో తీర్మానించారు.ఈ సమావేశంలో కొమ్మూరు సర్పంచ్ వనజ గంగాధర్ గారు , మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గోపాల్ గౌడ్ గారు , ఉప సర్పంచ్ రమేష్ నాయక్ , డాక్టర్ రోహిణి, పంచాయతీ కార్యదర్శి అనురాధ మరియు రైతులు పాల్గొన్నారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లాలో కొనసాగుతున్న కార్యక్రమాల ను పర్యవేక్షించాలి.
- జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక

**నారాయణపేట, జులై,27**





జిల్లాలో వివిధ శాఖలలో కొనసాగుతున్న కార్యక్రమాలను జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ జిల్లా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణ లో భాగంగా పూరించిన ఎన్యూమరేషన్ పత్రాల రేషనైలేజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.రాబోయే రెండు రోజుల పాటు తహసీల్దార్లు ఈ పనిపైనే పూర్తిస్థాయిలో దృష్టి సారించాలన్నారు. ప్రతి సూపర్‌వైజర్ క్షేత్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షించాలని తెలిపారు.అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగించబడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. గ్రామాలలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల పై పంచాయతీ వారీగా సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు.రోజూ వారి పురోగతిపై నివేదిక సమర్పించాలని వీడియో కాన్ఫరెన్స్ లో ఎంపీడీవోలకు సూచించారు.ఎల్ నినో ప్రభావం అధికంగా ఉండే ఆస్కారం ఉందని ఆమె తెలిపారు. జిల్లా కు 1,144 ఫామ్ ఫౌండ్ లక్ష్యం విధించారని, ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం రెండు ఫామ్ ఫౌండ్ గ్రౌండ్ చేయాలని సూచించారు.అవసరమైతే వెంటనే పరిపాలనా అనుమతులు (Sanctions) మంజూరు చేయాలని ఆదేశించారు. వీ బీ జీ రామ్ జీ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ప్రస్తుతం డెంగ్యూ ప్రభావం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.అడపాదడపా కురుస్తున్న వర్షాల కారణంగా దోమల వ్యాప్తికి ఎక్కువ అవకాశం ఉన్నందున నివారణ చర్యలు చేపట్టాలన్నారు. "మన ఇల్లు – మన ఆరోగ్యం" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఆ కార్యక్రమ ఫోటోలను జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి కి పంపించాలని సూచించారు. దోమల లార్వా నిర్మూలన చర్యలు చేపట్టడంతో పాటు ప్రతి శుక్రవారం "ఫ్రైడే డ్రైడే" కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఫీవర్ సర్వే పై వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు నివేదిక ఇవ్వాలన్నారు. ప్రస్తుత సీజన్ అత్యంత కీలకమైనందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. సీఎం ప్రజావాణి ద్వారా వచ్చిన అన్ని ఫిర్యాదులను సంబంధిత అధికారులు వచ్చే వారం లోపు పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను ఆదేశించారు.ఈ సమావేశంలో డీ ఆర్ వో రాజేశ్వరి, డిప్యూటీ కలెక్టర్ ఫణి కుమార్, జెడ్పీ సీ ఈ వో శ్రీనివాస్ రావు, డిఆర్డిఓ/ డీ పీ వో వెంకట్ రాములు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## 37లో 33 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల శాసనసభల్లో జాతీయ ఈ-విధాన్ అమలు

**న్యూఢిల్లీ, జూలై 27 :**

జాతీయ ఈ-విధాన్ అప్లికేషన్ (NeVA) అమలుకు దేశంలోని 37 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల శాసనసభల్లో 33 శాసనసభలు అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. వీటిలో 21 శాసనసభలు ఇప్పటికే పూర్తిస్థాయి డిజిటల్ శాసనసభలుగా మారాయి. NeVA ద్వారా శాసనసభ కార్యకలాపాల నిర్వహణ పూర్తిగా డిజిటల్‌గా జరుగుతోంది. దీంతో కాగితం వినియోగం తగ్గడంతో పాటు శాసన ప్రక్రియ వేగవంతమై, పత్రాల ప్రాప్యత మెరుగుపడింది. ముద్రణ, నిర్వహణ, నిల్వ ఖర్చులు కూడా తగ్గాయి. నీతి ఆయోగ్ నిర్వహించిన మధ్యంతర సమీక్షలో NeVA వల్ల శాసనసభల పనితీరు మరింత సమర్థవంతమైందని, ప్రభుత్వ శాఖలు–శాసనసభల మధ్య సమన్వయం మెరుగుపడిందని పేర్కొంది. సైబర్ భద్రత కోసం NeVAను ఎన్ఐసీ మేఘ్‌రాజ్ 2.0 క్లౌడ్‌కు మార్చగా, భాషిణితో అనుసంధానం చేయడం ద్వారా వివిధ భారతీయ భాషల్లో సమాచారం అందుబాటులోకి వచ్చింది. ఈ విషయాన్ని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు.

# హనుమాన్ నగర్ గిరిజన గ్రామానికి విద్యుత్ వెలుగులు

**మహాముత్తారం జూలై27 :**



మండలం బోర్లగూడెం శివారు హనుమాన్ నగర్ గిరిజన గ్రామానికి 12 ఏళ్ల తర్వాత విద్యుత్ సౌకర్యం కల్పించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అటవీ హక్కుల చట్టం-2006 సెక్షన్ 3(2) కింద అవసరమైన అనుమతులు మంజూరు చేయడంతో విద్యుత్ లైన్ల ఏర్పాటు పూర్తయ్యింది. మరో రెండు రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు కానున్నాయి. ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి గ్రామస్థులు జ్ఞాపిక అందజేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు, న్యాయ పట్టభద్రుడు కొర్ర ఆనంద్ నాయక్, ఐటిడిఏ పీవో లెనిన్ వత్సల్ టొప్పో, మాజీ డీఎఫ్‌వో నవీన్ రెడ్డి, ప్రస్తుత డీఎఫ్‌వో జి. కిష్ట గౌడ్ సేవలను కలెక్టర్ అభినందించారు.

## స్త్రీనిధి రుణాలతో మహిళల ఆదాయాభివృద్ధికి చర్యలు : జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల జూలై27:**

జిల్లాలో మహిళా సంఘాల సభ్యులు స్త్రీనిధి రుణాలను వినియోగించి ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా స్త్రీనిధి, సెర్ప్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన స్త్రీనిధి జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాకు కేటాయించిన రుణ లక్ష్యాలను పూర్తిచేయడంతో పాటు బకాయిలు లేకుండా చూడాలని, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. అదనపు జిల్లా కలెక్టర్ రాజగౌడ్ మాట్లాడుతూ, గ్రామీణ, పట్టణ మహిళలు మైక్రో ఫైనాన్స్ సంస్థల బారిన పడకుండా స్త్రీనిధి ఏర్పాటు చేశామని, అర్హులైన మహిళలకు రుణాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఓ ఎం. రఘువరన్, వివిధ శాఖల అధికారులు, స్త్రీనిధి రీజినల్ మేనేజర్ రాం నారాయణ, మెప్మా అధికారులు, జిల్లా సమాఖ్య ప్రతినిధులు, మండలాల ఏపీఎంలు, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.



## సంతాపం తెలిపిన బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి RS ప్రవీణ్ కుమార్



- మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి తల్లి , మాజీ జెడ్పిటిసి షాబాద్ ,అవినాష్ రెడ్డి నాయనమ్మ మృతి

**షాబాద్, జూలై 26 :**

షాబాద్ మండలంలో మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి గారి తల్లి అవినష్ రెడ్డి నాయనమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి, విజయ్ ఆర్య క్షత్రియ తో కలిసి ఈరోజు షాబాద్ మండలంలోని వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం వారి తల్లిగారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి , వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

చురకలు

మంగళవారం 28.07.2026

# గండిడ్ మండల అభివృద్ధిపై అధికారులతో పరిగి ఎమ్మెల్యే డాక్టర్. టీ. రామ్మోహన్ రెడ్డి సమీక్ష

**గాండీడ్ మండలం, జులై,27**




గండిడ్ మండల సమగ్ర అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (SIR) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు.గండిడ్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల స్థాయి అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలపై శాఖల వారీగా సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి, వాటిని నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, ప్రభుత్వ సేవలు ప్రజలకు సమర్ధవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియపై బీఎల్ఓలు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులకు ఎమ్మెల్యే అవగాహన కల్పించారు.అర్హులైన ప్రతి ఒక్కరి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజల్లో SIR ప్రక్రియపై విస్తృత అవగాహన కల్పించి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా,సమర్ధవంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, స్థానిక నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించాలి

- **ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అమలు చేయాలి: కలెక్టర్ రాహుల్ శర్మ**

**భూపాల పల్లి జులై27**



ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గుతున్న నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించి, తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచి రైతులకు సకాలంలో సాంకేతిక సలహాలు అందించాలని సూచించారు. పంటల సాగు పురోగతిపై ప్రతిరోజూ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అదేవిధంగా, ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా ఇరిగేషన్ వనరుల్లోని నీటిని కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించాలని ఇరిగేషన్ అధికారులకు స్పష్టం చేశారు. రిజర్వాయర్లు, కాలువల నుంచి వ్యవసాయానికి నీటిని విడుదల చేయరాదని, నిబంధనలు ఉల్లంఘించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా నీటిని వృథా చేయకుండా సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# బాధ్యతతో మెలుగుతాం.. ప్రకృతిని కాపాడుకుంటాం

**మీర్జాపూర్ లో విద్యార్థుల ప్రతిజ్ఞ**

**కోస్గి,మండలం, జులై,27**



జీవుల రాశుల మనుగడకు మూలధారమైన ప్రకృతిని రక్షించుకుంటామని బాధ్యతాయుతంగా మెలిగి భవిష్యత్తును కాపాడుకుంటామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ప్రపంచం ప్రకృతి సంరక్షణ దినోత్సవం పురస్కరించుకుని నారాయణపేట జిల్లా కోస్గి మండలం మీర్జా పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎర్త్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటి వేడుకలను జరుపుకున్నారు.ఈ సందర్భంగా జాతీయ హారిత దళ సమన్వయకర్త వార్ల మల్లేశం మాట్లాడుతూ..భూమి, గాలి, నీరు, ఆకాశం, అగ్ని,అనే పంచాభూతాలను ప్రకృతి మనకు అందించిందని గుర్తు చేస్తూ మానవుడు జీవించడానికి అవసరమైన ప్రతి వస్తువుని ప్రకృతిని పొందుతున్నాడని వివరించారు.ప్రకృతి వనరులు అపరిమితమైనవనే ఆలోచన లేక స్వార్థం కోసం ప్రకృతిని విచ్చలవిడిగా నాశనం చేస్తున్నాడని దీంతో భూగోళం వేడెక్కిపోయి జీవుల మనుగడకు ముప్పు ఏర్పడిందని అన్నారు.మానవ ఉనికి కాపాడు పోవాలంటే ప్రకృతి రక్షించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మొక్కలు నాటడం, నీటిని పొదుపుగా వాడడం, ప్లాస్టిక్ నివారించుకోవడం వంటి పనులకు శ్రీకారం చుడితేనే భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం అందించగలుగుతామని అన్నారు. ప్రకృతిని రక్షిస్తేనే అది మనల్ని రక్షిస్తుందనే ఆలోచన అందరికీ రావాలని అన్నారు. అనంతరం విద్యార్థులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సిద్రాములు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించుటకు సమీక్ష సమావేశం

**మద్దూరు మున్సిపల్, జులై,27**



మద్దూరు మున్సిపాలిటీ కార్యాలయంలో SIR కార్యక్రమం విజయవంతంగా నిర్వహించుటకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించబడింది.ఈ సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ డిల్లికర్ సరస్వతి జనార్ధన్ , మున్సిపల్ కమిషనర్ సి. శ్రీకాంత్ మరియు సమావేశాన్ని నిర్వహించి SIR కార్యక్రమం అమలుపై సమగ్రంగా సమీక్షించారు.సమావేశంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించడం, అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించి నమోదు చేయడం, వివరాల సవరణలు, మార్పులు, చేర్పులను నిబంధనల ప్రకారం వేగవంతంగా పూర్తి చేయడం, ఇంటింటి సర్వే నిర్వహించి ఎటువంటి అర్హులైన ఓటరు మిగలకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు , కొ –ఆప్షన్ సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, (BLO)లు పరస్పర సమన్వయంతో పనిచేసి SIR కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# సమన్వయంతో ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను వందశాతం పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ ప్రియాంక.**

**నారాయణపేట, జులై,27**



ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్.) కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఓటరు ఎన్యూమరేషన్ పత్రాల సేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకుందని, జిల్లాలో ఇప్పటికే దాదాపు 95 శాతం పూర్తయిందని, మిగిలిన 5 శాతాన్ని కూడా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) సమన్వయంతో పూర్తి చేసి వందశాతం లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్.ఐ.ఆర్. పురోగతిపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఎన్యూమరేషన్ పత్రాల సేకరణ అనంతరం రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. ఇంకా మిగిలిన 5 శాతం ఓటర్లలో కొందరి పేర్లు రెండు ప్రాంతాల్లో ఉండే అవకాశం ఉందని, తమ ఓటు ఎక్కడ కొనసాగించాలనే సందిగ్ధంలో వారు ఉండవచ్చని పేర్కొన్నారు. ఒక ఓటరుకు ఒకే చోట మాత్రమే ఓటు హక్కు ఉండాలని, రెండు చోట్ల ఓటరు పేర్లు ఉండకూడదని స్పష్టం చేశారు. ఓటర్లు తమ ఓటు ఎక్కడ కొనసాగించాలనుకుంటున్నారో నిర్ణయించుకుని, మరో ప్రాంతంలోని ఓటును రద్దు చేయించుకునేందుకు సంబంధిత బీఎల్‌వోకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం ప్రస్తుతం ఓటు కొనసాగించదలిచిన పోలింగ్ కేంద్రానికి చెందిన బీఎల్‌వోకు ఎన్యూమరేషన్ పత్రాలు పూర్తి చేసి అందజేయాలని తెలిపారు. రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్ఏలు తమ పరిధిలో ఇంకా ఎన్యూమరేషన్ పత్రాలు సమర్పించని ఓటర్లకు అవగాహన కల్పించి, వారు త్వరితగతిన పత్రాలు పూర్తి చేసి అందజేసేలా చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్వో రాజేశ్వరి, సీ–సెక్షన్ అధికారి జయసుధ, రాజకీయ పార్టీల ప్రతినిధులు అబ్దుల్ సలీమ్, కెంచి శ్రీను, మహమ్మద్ సలీమ్, వెంకట్రాం రెడ్డి, రాఘవ చౌదరి, కెంచి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**హనుమకొండ, జూలై 27**

హనుమకొండలోని రంగంపేట కల్పలత సూపర్ బజార్ సహకార సంఘాన్ని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సూపర్ బజార్, పెట్రోల్ బంక్, టెక్స్‌టైల్స్ విభాగం, ప్రభుత్వ పాఠ్యపుస్తకాల పంపిణీ కేంద్రాన్ని పరిశీలించి సేవలు, నిర్వహణ, సరుకుల లభ్యతపై ఆరా తీశారు. చేనేత ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించడంతో పాటు విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగించాలని అధికారులకు సూచించారు. సహకార సంఘాలు సమర్థవంతంగా పనిచేస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

## నేడు బీసీ గురుకుల ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

**పెద్దపల్లి జూలై 27**

పెద్దపల్లి జిల్లాలోని మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం స్పాట్ అడ్మిషన్లు జూలై 28 ఉదయం 10 గంటలకు సుల్తానాబాద్ భూపతిపూర్‌లోని బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మార్చి–2026 ఎస్ఎస్సీ పరీక్షల్లో 450 లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఎస్ఎస్సీ మెమో, ఆధార్, బోనాఫైడ్ తదితర ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9550446246ను సంప్రదించాలని తెలిపారు.

## ఎయిర్ హోస్టెస్ - ఎయిర్ పోర్ట్ గ్రౌండ్ స్టాఫ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**పెద్దపల్లి, జూలై 27:**



పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎస్సీ, ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన 17 నుంచి 24 సంవత్సరాల మధ్య వయస్సు గల అవివాహిత యువతీ, యువకులకు 6 నెలల ఎయిర్ హోస్టెస్ – ఎయిర్‌పోర్ట్ గ్రౌండ్ స్టాఫ్ శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (DIEO) కల్పన తెలిపారు. శిక్షణ మొత్తం ఫీజు రూ.1,42,000 కాగా, ఇందులో రూ.1,09,000ను జిల్లా కలెక్టర్ భరిస్తారు. అభ్యర్థులు హాస్టల్ ఫీజుగా నెలకు రూ.5,500 చొప్పున 6 నెలలకు మొత్తం రూ.33,000 మాత్రమే చెల్లించాలి. శిక్షణ పూర్తయ్యాక అర్హత సాధించిన వారికి విమానాశ్రయాల్లో Passenger Service Assistant (PSA), Baggage Handling Service (BHS), Digi Buddy తదితర విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయి. ప్రారంభ వేతనం రూ.18,000 నుంచి రూ.25,000 వరకు ఉండే అవకాశం ఉంది. దరఖాస్తుల చివరి తేదీ: 14-08-2026 సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: 📞 99639 60063, 📞 86881 06554

## ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో పంటమార్పిడిపై రైతులు దృష్టి సారించాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్, జూలై 27 :**

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నందున రైతులు పంటమార్పిడి విధానాలను అనుసరించి ఆరుతడి పంటలు, ఉద్యానవన పంటలు, కూరగాయలు, ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. చిట్యాల గ్రామ రైతు వేదికలో జిల్లా స్థాయి విత్తన మేళాను ప్రారంభించిన కలెక్టర్, విత్తన ప్రదర్శన స్టాళ్లను పరిశీలించి రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేశారు. తక్కువ నీటితో అధిక లాభాలు ఇచ్చే పంటలను ప్రోత్సహించాలని, శాస్త్రీయ సాగు విధానాలు పాటించాలని సూచించారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు 8,751 ఎకరాలకు చేరిందని, ఈ ఏడాది లక్ష్యాన్ని మించి 1,670 ఎకరాలకు నాన్–సబ్సిడీ నమోదు పూర్తయిందని తెలిపారు. వచ్చే ఏడాది 5,000 ఎకరాలకు సాగు విస్తరించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. రైతులు నేల పరీక్షల ఆధారంగా మాత్రమే ఎరువులు వినియోగించాలని, భూసార పరిరక్షణ కోసం నానో యూరియా వినియోగాన్ని పెంచాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## పంట మార్పిడితోనే భవిష్యత్తు తరాల మనుగడ: కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్, జూలై 27**

: సూపర్ ఎల్‌నినో ప్రభావం, నీటి కొరత నేపథ్యంలో రైతులు వరిపై ఆధారపడకుండా ఆరుతడి పంటలు, కూరగాయలు, చిరుధాన్యాలు, నూనెగింజలు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో నిర్వహించిన విత్తన మేళాలో ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్‌తో కలిసి ప్రాజెక్టు వైవిధ్యం కార్యక్రమాన్ని ప్రారంభించి రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ, తక్కువ వర్షపాతం దృష్ట్యా ప్రతి రైతు పంట మార్పిడి చేపట్టడంతో పాటు పంట కుంటలు ఏర్పాటు చేసుకుని సేంద్రియ సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ, అధికంగా వరి సాగు వల్ల భూసారం తగ్గడం, అధిక యూరియా వినియోగం, మార్కెటింగ్ సమస్యలు వంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చట్టవిరుద్ధం.. ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**హన్మకొండ జూలై27**

హనుమకొండ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ. అప్పయ్య అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి పీసీ–పీఎన్డీటీ అడ్వైజరీ కమిటీ సమావేశంలో జిల్లాలో బాలికల నిష్పత్తి, స్కానింగ్ కేంద్రాల పర్యవేక్షణ, డీకాయ్ ఆపరేషన్లపై సమీక్ష నిర్వహించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, వాటి ఆధారంగా గర్భస్రావాలు చేయించడం చట్టవిరుద్ధమని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో అనుమతి లేకుండా నడుస్తున్న మూడు స్కానింగ్ యంత్రాలను సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమ లింగ నిర్ధారణపై ఖచ్చితమైన సమాచారం అందించిన వారికి రూ.50 వేల ప్రోత్సాహకం అందజేస్తామని పేర్కొన్నారు. అలాగే ఎంటీపీ చట్టం ప్రకారం గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో మాత్రమే నిబంధనల మేరకు గర్భవిచ్ఛిత్తికి అనుమతి ఉంటుందని, నాటు వైద్యం లేదా అనధికార వైద్యులను ఆశ్రయించి ప్రాణాలను ప్రమాదంలో పెట్టుకోవద్దని సూచించారు.

## వర్షం కురువాలని వరుణ యాగం చేసిన ఆలయ అధికారి. కొత్తపల్లి వెంకటయ్య.



**వలిగొండ జూలై 27**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెంకటాపురం వెలసిన శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వర్షం కురవాలని వరుణ యాగం నిర్వహించి వర్షాలు కురిసి రైతులు పంటలు బాగా పండించాలని, ప్రజలంతా సుభిక్షంగా ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడమైనదని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కే.వెంకటయ్య ఒక ప్రకటనలో తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భార్య, ఇద్దరు పిల్లలు అదృశ్యం.. మిస్సింగ్ కేసు నమోదు

**మల్కాజిగిరిజూలై27**



నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైన ఘటన వెలుగులోకి వచ్చింది. భర్త అశోక్ ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అశోక్ తెలిపిన వివరాల ప్రకారం, జూన్ 29న వ్యక్తిగత పనుల కోసం మియాపూర్ వెళ్లిన సమయంలో ఆయన భార్య సబిత తన ఇద్దరు కుమారులు అభిరామ్ (11), ఆర్య (1)తో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. తిరిగి వచ్చాక బంధువులు, తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదని, మొబైల్ ఫోన్ కూడా స్విచ్ ఆఫ్‌లో ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంటినుంచి వెళ్లే ముందు స్వల్ప కుటుంబ కలహం జరిగినట్లు, గతంలో కూడా ఇలాంటి ఘటన జరిగి తిరిగి ఇంటికి వచ్చిన నేపథ్యంలో కొంతకాలం వేచి చూసిన తర్వాత జూలై 24న పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసిన నేరేడ్మెట్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## దక్షిణ మధ్య రైల్వేలో ఐదుగురికి 'ఎంప్లాయీ ఆఫ్ ది మంత్' భద్రతా అవార్డులు





**సికింద్రాబాద్ జులై27**

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సోమవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో నిర్వహించిన భద్రతా సమీక్షా సమావేశంలో జూన్–2026కు గాను ఐదుగురు ఉద్యోగులకు 'ఎంప్లాయీ ఆఫ్ ది మంత్' భద్రతా అవార్డులను ప్రదానం చేశారు. విధి నిర్వహణలో అప్రమత్తతతో అసురక్షిత పరిస్థితులను నివారించిన ట్రైన్ మేనేజర్, పాయింట్స్‌మెన్, సీనియర్ టెక్నీషియన్, స్టేషన్ మాస్టర్ తదితరులను ఆయన అభినందించారు. అనంతరం రైల్వే భద్రతపై సమగ్ర సమీక్ష నిర్వహించి, వర్షాకాలంలో రోడ్డు అండర్ బ్రిడ్జిల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, బ్యారికేడ్లు ఏర్పాటు, 24 గంటల పర్యవేక్షణ, ప్రతి నాలుగు గంటలకు పరిస్థితిపై నివేదికలు పంపించాలని అధికారులను ఆదేశించారు.

## ప్రజావాణిలో 2,433 అర్జీలు.. సత్వర పరిష్కారానికి కలెక్టర్ ఆదేశం

**హైదరాబాద్, జూలై 27**

ప్రజావాణిలో అందిన అర్జీలను శాఖల వారీగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అధికారులను ఆదేశించారు. సీఎం ప్రజావాణి, కలెక్టరేట్ ప్రజావాణిలో పెండింగ్ దరఖాస్తులను వచ్చే ప్రజావాణి నాటికి పరిష్కరించాలని సూచించారు. ఎస్ఐఆర్ ఫారాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలని, చేయూత పింఛన్ల దరఖాస్తుల పరిశీలనను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రజావాణిలో మొత్తం 2,433 దరఖాస్తులు అందగా, వాటిలో 2BHK గృహాలకు 2,254, పింఛన్లకు 153, రెవెన్యూకు 16, ఇతర శాఖలకు 10 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

## దివ్యాంగ యువకుడి కలను నిజం చేసిన మల్కాజ్ గిరి సీపీ బాడుగుల సుమతి

**నేరేడ్మెట్/మల్కాజ్ గిరి: జూలై27**



పుట్టుకతోనే వైకల్యంతో నడవలేని పరిస్థితిలో ఉన్న దమ్మాయిగూడకు చెందిన యువకుడు రాహుల్ జీవితకాల కోరికను మల్కాజ్ గిరి పోలీస్ కమిషనర్ బాడుగుల సుమతి నెరవేర్చారు. ఒకరోజైనా పోలీసు అధికారిగా కుర్చీలో కూర్చోవాలన్న రాహుల్ ఆకాంక్షను గుర్తించిన సీపీ, అతడిని కమిషనరేట్ కార్యాలయానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. తన అధికారిక కుర్చీలో రాహుల్ ను కూర్చోబెట్టి, స్వయంగా పోలీసు టోపీ తొడిగించారు. అనంతరం "నీ కోరిక తీరిందా రాహుల్?" అంటూ ఆప్యాయంగా పలకరించగా, రాహుల్ ముఖంలో కనిపించిన ఆనందం అందరినీ కదిలించింది. రాహుల్ తల్లిదండ్రులు తిరుమలరావు, రాధమ్మ ప్రకాశం జిల్లా కందుకూరు నుంచి వలస వచ్చి దమ్మాయిగూడలో స్థిరపడ్డారు. పుట్టుకతోనే వైకల్యం కారణంగా రాహుల్ నడవలేకపోవడంతో పాటు స్పష్టంగా మాట్లాడలేని పరిస్థితిలో జీవిస్తున్నాడు. దీంతో కుటుంబానికి భారంగా మారాననే భావనతో మానసికంగా కూడా బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ, ప్రతిమ ఫౌండేషన్ చైర్మన్ రష్మిత కలిసి రాహుల్ కు వీల్ చైర్ అందజేసి అండగా నిలిచారు. ఈ సందర్భంగా సీపీ బాడుగుల సుమతి మాట్లాడుతూ, వైకల్యంతో బాధపడుతున్న వారి పట్ల సమాజంలోని ప్రతి ఒక్కరూ ప్రేమ, ఆదరణ, దయ చూపాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు మరింత చొరవతో ముందుకు వచ్చి దివ్యాంగులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అలాగే పేదలు, అభాగ్యుల కోసం స్వచ్ఛంద సంస్థలు నిస్వార్థ సేవాభావంతో పనిచేసినప్పుడే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు. వికలాంగులు, మూగ–చెవిటివారిని సోదరభావంతో ఆదరించాలని సూచిస్తూ, సమాజ సేవలో నిమగ్నమైన స్వచ్ఛంద సంస్థల కృషిని అభినందించారు. తమ కుమారుడి కల నెరవేరడంతో ఆనందానికి అవధులు లేకుండా పోయాయని రాహుల్ తల్లిదండ్రులు తెలిపారు. సీపీ బాడుగుల సుమతి, రష్మిత, మెరుగు శివకృష్ణలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ దామరపల్లి నర్సింహారెడ్డి, చింతల విజయ్ కుమార్, జినుక రఘు తదితరులు పాల్గొన్నారు.

## పరిగి పోలీస్ స్టేషన్ ను సందర్శించి వార్షిక తనిఖీ





- మల్టీ జోన్–II ఐజీపీ షహనవాజ్ ఖాసీం ఐపీఎస్
- వార్షిక తనికిలలో భాగంగా...

**పరిగి మున్సిపల్, జులై,27**

వార్షిక తనిఖీలలో భాగంగా మల్టీ జోన్–II గౌరవ ఐజీపీ షహనవాజ్ ఖాసీం, IPS సోమవారం పరిగి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ స్నేహ మెహ్రా, IPS ఐజీపీ కి బొకే అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించిన ఐజీపీ పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి తనిఖీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.తనిఖీలో భాగంగా పోలీస్ అధికారులు, సిబ్బంది టర్న్‌అవుట్, క్రమశిక్షణ, విధి నిర్వహణ తీరు, ప్రజల పట్ల వ్యవహరించే విధానం, కార్యాచరణ సామర్థ్యాన్ని సమగ్రంగా పరిశీలించారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడి వారు నిర్వహిస్తున్న విధులు, ప్రజలకు అందిస్తున్న సేవలు, సాధించిన విజయాలు, ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తూ, ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా సేవలు అందించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన ఐజీపీ, "వికారాబాద్ రక్షణ నేత్రం" కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పనితీరు, ప్రత్యక్ష పర్యవేక్షణ వ్యవస్థ, నేరాల నియంత్రణలో వాటి వినియోగాన్ని పరిశీలించి పోలీసుల పనితీరును ప్రశంసించారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసు ఫైళ్లు, స్టేషన్ డైరీలు, వివిధ రిజిస్టర్లు, మాల్ఖానా నిర్వహణ, రిసెప్షన్, లాకప్, కంప్యూటర్ విభాగం, మహిళా సహాయ కేంద్రం, సీసీటీఎన్ఎస్ నిర్వహణ, డిజిటల్ రికార్డుల నిర్వహణ తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. కేసుల దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచాలని, పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించాలని, ప్రతి కేసులో నాణ్యమైన సాక్ష్యాధారాల సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, రికార్డుల నిర్వహణలో నిర్దేశిత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి ఐజీపీ మాట్లాడుతూ, "ప్రతి పోలీస్ అధికారి తనలో ఉన్న సామర్థ్యాన్ని గుర్తించి నిరంతరం అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలి. సరైన అలవాట్లు, క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం, సేవా దృక్పథం ప్రతి పోలీస్‌కు అత్యంత అవసరం. ప్రజలకు న్యాయం చేయడం, వారి విశ్వాసాన్ని నిలబెట్టడం ప్రతి పోలీస్ బాధ్యత" అని పేర్కొన్నారు.అదేవిధంగా సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, NDPS చట్టం కింద మాదకద్రవ్యాల నిర్మూలనకు మరింత కఠిన చర్యలు కొనసాగించాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని, ప్రమాదం జరిగిన వెంటనే స్పందిస్తూ గోల్డెన్ అవర్ సమయంలో బాధితులకు తక్షణ వైద్య సహాయం అందేలా పోలీస్ అధికారులు వేగంగా స్పందించాలని, ప్రతి ప్రాణం విలువైనదనే భావనతో పనిచేయాలని సూచించారు.ప్రజలతో మరింత స్నేహపూర్వకంగా మెలుగుతూ కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని, గ్రామస్థాయిలో ప్రజలతో సమన్వయాన్ని పెంపొందించాలని, మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, శాంతిభద్రతల పరిరక్షణలో సాంకేతిక పరిజ్ఞానం, నిఘా వ్యవస్థలు, సీసీటీవీ నెట్‌వర్క్‌ను సమర్థవంతంగా వినియోగించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.అనంతరం పరిగి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఐజీపీ గారు మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి పోలీస్ అధికారి విధి నిర్వహణతో పాటు పర్యావరణ పరిరక్షణలోనూ తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, IPS, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, పరిగి సీఐ కొండల్ రెడ్డి,పరిగి ఎస్ఐ మోహన కృష్ణ , ఇతర పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి

ఎంఈఓ ఆఫీస్ ముందు సిపిఎం ధర్నా.

**వలిగొండ జూలై 27**



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో ప్రభుత్వ పాఠశాలల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రోజున వలిగొండ ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఐఎస్ కోఆర్డినేటర్ సువర్ణకు వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య,మండల కార్యదర్శి సిర్పంగి స్వామి లు మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నేటికీ యూనిఫామ్స్ అందించలేదని వెంటనే యూనిఫారాలు అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సీసీ కెమెరాలు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం డైరీలను అందించాలని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పహిల్వాన్ పురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెంటనే ప్రహరీ గోడను నిర్మించాలని అదేవిధంగా మండల వ్యాప్తంగా అనేక పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని పేరుతో పాఠశాలలను తొలగించే ప్రయత్నాన్ని ప్రభుత్వం వెంటనే మానుకోవాలని, డిప్యూటేషన్ పేరుతో ఒక పాఠశాల నుండి మరొక పాఠశాలకు టీచర్ల బదిలీలను ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు న్యాయమైన భోజనం అందించేందుకు నిధుల కేటాయింపు పెంచాలని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వాచ్మెన్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని చెబుతూనే మరొకవైపు విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే చర్యలను వెంటనే మానుకోవాలని ఇప్పటికే మండలంలో మూసివేసిన పాఠశాలను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మొగిలిపాక గోపాల్,కొండే కిష్టయ్య, దుబ్బ లింగం, కవిడే సురేష్, భీమనబోయిన జంగాయ్య, వలిగొండ పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, నాయకులు వేముల నాగరాజు,ధ్యాన బోయిన యాదగిరి, కొండూరు సత్తయ్య,ఉండాటి పాపయ్య, గంగాపురం వెంకటేశం,ఏటెల్లి నరసింహ, కందుల మత్స్యగిరి,కంబాలపల్లి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

జిల్లా కలెక్టర్ అంకిత్

**లక్ష్మీదేవిపల్లి జూలై27**

మండలం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిశుభ్రత, ఓపీ, జ్వర కేసులు, రక్త పరీక్షలు, మందుల నిల్వలు, యాంటీ స్నేక్ వెనం ఇంజక్షన్లు, ఆయుష్ క్లినిక్ సేవలను పరిశీలించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, జ్వరంతో వచ్చే ప్రతి రోగికి వెంటనే పరీక్షలు చేసి చికిత్స అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. మందుల కొరత లేకుండా ముందస్తుగా నిల్వలు ఉంచుకోవాలని, రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచేలా పనిచేయాలని సూచించారు.



# పథకం ప్రకారం హత్య.. నిందితుల అరెస్ట్







జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS

**మద్దూరు మున్సిపల్(మం) జులై,27**

మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాదవరావుపల్లి గ్రామానికి చెందిన గొయికల శాంతమ్మ (45) అదృశ్యమైనట్లు ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 15.07.2026న మద్దూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS తెలిపారు.దర్యాప్తులో భాగంగా మృతురాలి వద్ద ఉన్న బంగారు నగలను దోచుకోవాలనే ఉద్దేశంతో జోగు రాజు (A-1), బడుగుల భాస్కర్ (A-2) ముందుగానే పథకం రచించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో 12.07.2026న శాంతమ్మను ఫోన్ ద్వారా మద్దూర్‌కు రప్పించి, మోటార్ సైకిల్‌పై జాజాపూర్ చెరువు సమీపంలోని చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి, మద్యం సేవించిన అనంతరం ఆమెతో శారీరకంగా కలిసి, చున్నీతో గొంతు బిగించి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది. హత్య అనంతరం మృతురాలి వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాలు, సెల్‌ఫోన్, పర్సు, ఆధార్ కార్డును తీసుకుని, ఆధారాలను నాశనం చేసే ఉద్దేశంతో వాటిని బోరు కేసింగ్‌లో పడవేశారు. అనంతరం బంగారు నగలను నారాయణపేటలో విక్రయించి వచ్చిన నగదును ఇద్దరూ పంచుకున్నట్లు నిందితులు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు.నిందితుల వద్ద నుంచి ఒక తులం బంగారు ఆభరణాలు (కమ్మలు, మ్యాట్నీలు, పుస్తెల గుండ్లు), 50 తులాల వెండి ఆభరణాలు (కడియాలు, పట్టీలు), రూ.50,000 నగదు, నేరానికి ఉపయోగించిన రెండు మోటార్ సైకిళ్లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే దొంగిలించిన బంగారు నగలను కొనుగోలు చేసిన జాజాపూర్ గ్రామానికి చెందిన కృష్ణ (A-3)ను కూడా అరెస్ట్ చేసి, ముగ్గురు నిందితులను న్యాయస్థానంలో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.ఈ కేసును డీఎస్పీ ఎన్. లింగయ్య పర్యవేక్షణలో అత్యంత సమర్థవంతంగా ఛేదించిన కోస్గి సీఐ సైదులు, మద్దూర్ ఎస్సై బి. శ్రీనివాసులు, ఏ ఎస్సై బాలయ్య, హెడ్ కానిస్టేబుళ్లు పెంటయ్య, గోపాల్, బి. రాజు, పోలీసు కానిస్టేబుళ్లు పుల్యా నాయక్, నాగమల్లయ్య, పరందాములు, సీసీఎస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరాలను అరికట్టడంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనల గురించి వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

# నీళ్లను డబ్బులాగా జాగ్రత్తగా వాడుకోవాలి

- ఎంపీడీవోలు జీ.విష్ణు, చందర్ నాయక్
- ఊరికి ఊటకుంట, పొలానికి పంటకుంట, ఇంటికి ఇంకుడు గుంతే 'జలసిరి' లక్ష్యం
- జల సంరక్షణలో మహిళా సంఘాల పాత్ర కీలకం
- కోటగిరి ఎంపీడీవో కార్యాలయంలో 'జలసిరి' పై ప్రత్యేక సమావేశం



**కోటగిరి, జూన్ 27 :**

:- ఒకప్పుడు ఊళ్లో ఎవరి దగ్గరైనా చేతినిండా డబ్బులు కనబడితే "ఏంటయ్యా.. డబ్బుల్ని నీళ్లలా ఖర్చు పెడుతున్నావ్!" అనేవారు. కానీ, రోజులు మారాయి. ఇప్పుడు నీళ్లను కూడా ప్రతి రూపాయి లాగే చాలా జాగ్రత్తగా, పొదుపుగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి వచ్చిపడింది. ఈ నిజాన్ని ప్రతీ ఒక్కరికీ గుర్తుచేస్తూ, గ్రామాల్లో నీటి చుక్కను నిలబెట్టేందుకు కోటగిరి మండల కేంద్రంలో అడుగులు పడ్డాయి.సోమవారం కోటగిరి ఎంపీడీవో కార్యాలయం ఒక కీలక చర్చకు వేదికైంది. కోటగిరి, పోతంగల్ మండలాల ఎంపీడీవోలు జి. విష్ణు, చందర్ నాయక్ అధ్యక్షతన గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా సంఘాల ప్రతినిధులు ఒకచోట చేరారు. అక్కడ మారుమోగిన ఒకే ఒక్క పిలుపు——★'జలసిరి'★.

'జలసిరి' అంటే కేవలం ఒక పథకం కాదు, గ్రామాల్లో నీటి రూపురేఖలు మార్చే ఒక యజ్ఞం. ఊరి భూగర్భ జలాలు ఇంకిపోకుండా ★ఊరికి ఊటకుంట, రైతు పొలంలో పారే నీరు వృథా కాకుండా ★★పొలానికి పంటకుంట, వర్షపు నీటి చుక్కను నేలలోకే ఇంకించేలా ★★ప్రతి ఇంటికీ ఒక ఇంకుడు గుంత★ ఏర్పాటు చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఆశయం.ఈ యజ్ఞం ఊరి మూలమూలకూ చేరాలంటే ప్రతి ఇంట్లో వెలుగులు నింపే మహిళా సంఘాలే ముందుండాలని అధికారులు ఆకాంక్షించారు. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా సంఘాల ప్రతినిధులు అందరూ చేయి చేయి కలిపి క్షేత్రస్థాయిలో పనిచేస్తేనే ఊళ్లకు నీటి సిరి దక్కుతుందని ఎంపీడీవోలు పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో పోతంగల్ స్పెషల్ ఆఫీసర్ మున్ని నాయక్, ఏపీఎం భాస్కర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ధనరాజ్, ఏపీవో గంగారం కోటగిరి,పోతంగల్ మండలాలకు చెందిన జీ.పి.కార్యదర్శులు,ఫీల్డ్ అసిస్టెంట్లు,మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం:

### తెలంగాణ ఉద్యమకారుల ఫోరం

**మహబూబాబాద్ జూలై27**

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (TUF) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఉద్యమకారులకు ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఆలస్యం చేయకుండా అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కేకే కమిటీ ఏర్పాటును స్వాగతించిన వారు, ఆగస్టు 15లోపు హామీలను అమలు చేయాలని, లేనిపక్షంలో వంటావార్పు, రాస్తారోకోలు, బంద్‌ల వంటి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ముద్దసాని వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి సోమారపు వీరాస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాయిని శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ లో బాలికపై లైంగిక దాడి ఆరోపణ..

### పోక్సో కేసు నమోదు

**వర్ధన పేట జూలై27**

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలో నాలుగేళ్ల బాలికపై 50 ఏళ్ల వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలికను మాయమాటలు చెప్పి దాడి చేసినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. బాలిక జరిగిన విషయాన్ని తల్లికి చెప్పడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు పరారీలో ఉండటంతో గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు భాస్కర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నట్లు సమాచారం. కాగా, ఈ కేసును ప్రభావితం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారనే ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై అధికారిక ధృవీకరణ లేదు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## మహేశ్వరం తెలంగాణ మోడల్ స్కూల్‌ను సందర్శించిన సీఎస్ సంజయ్ జాజు

**హైదరాబాద్, జూలై 27**

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మహేశ్వరం మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌ను సందర్శించి విద్యా బోధన, మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించవచ్చని సూచించారు. అనంతరం తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, వసతి గృహాలు, పారిశుద్ధ్య సౌకర్యాలను పరిశీలించి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల వరకు టీజీఎస్ఆర్టీసీ బస్సు సేవలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించిన ఆయన, పాఠశాల ఆవరణలో మొక్క నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కొడంగల్ నవీన ఆదర్శ హైస్కూల్ లో మాజీ రాష్ట్రపతి ఏపీజే.అబ్దుల్ కలాం వర్ధంతి

**కొడంగల్ మున్సిపల్, జులై,27**

మాజీ రాష్ట్రపతి ఏపీజే .అబ్దుల్ కలాం వర్ధంతిని నవీన ఆదర్శ హైస్కూల్ లో నిర్వహించారు.. ముందుగా విద్యార్థులు ఉపాధ్యాయ బృందం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ డివి నరేష్ రాజు విద్యార్థులకు ఏపీజే అబ్దుల్ కలాం జీవిత చరిత్ర విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు ఏపీజే అబ్దుల్ కలాంని ఆదర్శంగా తీసుకొని విద్యార్థిలు చదువులో మంచి పేరు తీసుకొచ్చి తల్లిదండ్రులకు మరియు దేశానికి మంచి పేరు తేవాలి అని తెలియజేశారు.



## ఈ-సిటీ, మహేశ్వరం పారిశ్రామిక పార్కులను సందర్శించిన సీఎస్ సంజయ్ జాజు



**హైదరాబాద్, జూలై 27**

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం ఈ-సిటీ, మహేశ్వరం పారిశ్రామిక పార్కుల్లోని పలు పరిశ్రమలను సందర్శించి ఉత్పత్తి కార్యకలాపాలు, పెట్టుబడులు, ఉపాధి కల్పనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీమియర్ ఎనర్జీస్, అవాం టెల్, చిరిపాల్ పాలీ ఫిల్మ్స్, విప్రో ఎంటర్‌ప్రైజెస్, మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ తయారీ యూనిట్లను పరిశీలించారు. ఆయా సంస్థల ప్రతినిధులతో మాట్లాడి ఉత్పత్తి సామర్థ్యం, విస్తరణ ప్రణాళికలు, ఉపాధి అవకాశాలపై వివరాలు తెలుసుకున్నారు. పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పనలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అభినందించిన సీఎస్ సంజయ్ జాజు, రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి మరింత వేగం తీసుకురావాలని అధికారులకు సూచించారు.

## మాదకద్రవ్యాల నియంత్రణపై మరింత కఠిన చర్యలు: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై27**

ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ జిల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన ఎన్‌డీపీఎస్ చట్టం కేసుల సమీక్ష సమావేశంలో మాదకద్రవ్యాల నియంత్రణకు మరింత కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దర్యాప్తులో ఉన్న కేసులను వేగంగా పూర్తి చేసి, పకడ్బందీగా సాక్ష్యాధారాలు సేకరించి త్వరితగతిన ఛార్జ్‌షీట్లు దాఖలు చేయాలని సూచించారు. పరారీలో ఉన్న నిందితులను ప్రత్యేక బృందాలతో వెంటనే అరెస్టు చేయాలని, మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారుల ఆర్థిక లావాదేవీలు, అక్రమ ఆస్తులపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల వినియోగదారులకు కౌన్సెలింగ్ అందించి డీ-అడిక్షన్ కేంద్రాలకు పంపే ప్రక్రియను బలోపేతం చేయాలని, విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## రోడ్డుపై మురికి నీరు విడుదల చేసిన సంస్థకు రూ.15 వేల జరిమానా

**హైదరాబాద్ జూలై 27 /**

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నెం.10, వెంకటేశ్వర కాలనీలో ఉన్న "ఐషా రావు బ్రైడల్ వేర్" సంస్థ సంపు శుభ్రపరిచిన మురికి నీటిని రోడ్డుపైకి విడుదల చేసి డ్రైనేజీ వ్యవస్థకు అంతరాయం కలిగించినందుకు జలమండలి అధికారులు రూ.15,000 జరిమానా విధించారు. ఫిర్యాదు మేరకు ఘటనాస్థలాన్ని పరిశీలించిన అధికారులు, సంపు శుభ్రపరిచే పనుల్లో ఉపయోగించిన డీవాటరింగ్ సబ్‌మర్సిబుల్ పంపును స్వాధీనం చేసుకున్నారు. భవిష్యత్తులో మురికి నీటిని రోడ్లపైకి విడుదల చేయకుండా జలమండలి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సంస్థ ప్రతినిధులకు సూచించారు. ఇలాంటి ఉల్లంఘనలు పునరావృతమైతే మరింత కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను జలమండలి ఏమాత్రం సహించదని అధికారులు హెచ్చరించారు.

## దళిత మహిళా జర్నలిస్టుపై దూషణల ఆరోపణలు : అట్రాసిటీ కేసు నమోదు

**హైదరాబాద్, జూలై 27**

కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ దళిత మహిళా జర్నలిస్టును దూషించి, బెదిరించారనే ఆరోపణలపై ఎ. పద్మారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీ) చట్టం కింద కేసు నమోదైనట్లు బాధితులు తెలిపారు. కల్తీ పన్నీరు విక్రయాల అంశాన్ని ప్రశ్నించినందుకే ఈ ఘటన జరిగిందని వారు ఆరోపిస్తున్నారు. జర్నలిస్టు సంఘాల ఒత్తిడి నేపథ్యంలో జూలై 25న కేసు నమోదు చేసినట్లు సమాచారం. జర్నలిస్టు సంఘాలు ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, విధి నిర్వహణలో ఉన్న మహిళా జర్నలిస్టుపై దూషణలు, బెదిరింపులు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నాయి. ఘటనపై సమగ్ర, నిష్పాక్షిక దర్యాప్తు జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి.

## ఆర్ఓబి పనులు వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**హైదరాబాద్ జూలై 27**

కరీంనగర్–చొప్పదండి ప్రధాన రహదారిపై తీగలగుట్టపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబి) పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. నిర్మాణంతో పాటు సర్వీస్ రోడ్లు, భూసేకరణ, డ్రైనేజీ తదితర అనుబంధ పనులను వేగవంతం చేయాలని సూచించారు. పనుల్లో జాప్యం లేకుండా నాణ్యతతో పూర్తి చేయడంతో పాటు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్ఓబి పూర్తయితే కరీంనగర్–చొప్పదండి మార్గంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.

## 2032 నాటికి ప్రపంచ టాయ్ మార్కెట్లో 5% వాటా లక్ష్యం

**న్యూఢిల్లీ, జూలై 27**

: భారత టాయ్ పరిశ్రమ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. 2032 నాటికి ప్రపంచ టాయ్ మార్కెట్లో భారత్ వాటాను 5 శాతానికి పెంచడమే లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా టాయ్ సెక్టార్ ప్లేబుక్ను విడుదల చేసి, తయారీ, ఆవిష్కరణలు, నాణ్యత, ఎగుమతులు, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని పరిశ్రమలకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశంలో 21 వేలకుపైగా ఎంఎస్ఎంఈలు, 770కిపైగా టాయ్ స్టార్టప్‌లు కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.



# ఎండతో ఆరోగ్యానికి అండ




**శరీర ఆరోగ్యానికి విటమిన్లు చాలా అవసరం. వాటిని పొందాలంటే రకరకాల ఆహారపదార్థాలు తినాలి. అయితే, విటమిన్ –డి మాత్రం ఆహారంలోనే కాదు.. ఉచితంగా కూడా లభిస్తుంది. ఉదయం పూట సూర్యరశ్మి నుంచి డి – విటమిన్ పొందొచ్చని అందరికీ తెలుసు. కానీ, ఉచితంగా వచ్చే ఆ విటమిన్ కూడా సరిగా సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు చాలామంది. ప్రస్తుత రోజుల్లో చూస్తే.. సూర్యుడి బారి నుంచి తప్పించుకోవాలనే చూస్తున్నారే తప్ప.. అందువల్ల జరిగే ప్రయోజనం గురించి ఆలోచన చేయట్లేదు. ఇలా నిర్లక్ష్యం చేస్తే.. డి – విటమిన్ లోపిస్తుంది. దానివల్ల చాలా అనారోగ్య సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. ఈ అంశం గురించి పూర్తిగా తెలుసుకోవాలంటే ఇది చదివేయండి.**

విటమిన్– డి ఎముకల్ని దృఢంగా ఉంచుతుంది. కొన్ని క్యాన్సర్లు రాకుండా అడ్డుకుంటుంది. ఇన్ని లాభాలున్నా భారతీయులకు మాత్రం డి – విటమిన్ లోపం ఉంటోందని స్టడీలో తేలింది. ప్రతి నలుగురిలో ముగ్గురికి విటమిన్–డి లోపం ఉంటోంది. పోయినేడాది ఓ సర్వేలో దాదాపు 76 శాతం మంది విటమిన్–డి లోపంతో బాధపడుతున్నారని తేలింది. అందులో ముఖ్యంగా 25 ఏళ్ల కంటే తక్కువ వయసున్న వాళ్లేనట.

## డిప్రెషన్ డి కారణమా?

ఇటీవల జరిగిన ఓ అధ్యయనం ప్రకారం విటమిన్ – డి లోపం డిప్రెషన్ కు దారి తీస్తుందట. డిప్రెషన్‌తో బాధపడుతున్న వ్యక్తుల రక్తంలో విటమిన్ – డి తక్కువగా కలిగి ఉంటారని పరిశోధనలో తేలింది. విటమిన్ – డి అందిన తర్వాత వారి మానసిక స్థితిలో మెరుగుపడిందని ఈ అధ్యయనం తెలిపింది. ఫంక్షనల్ న్యూట్రిషనిస్ట్ ముగ్ధ ప్రధాన్,సీఈఓ, స్థాపకుడు, ఐత్రైవ్ ప్రకారం, డిప్రెషన్ లో ఉన్న వారి పరిస్థితిని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. సాధారణంగా డిప్రెషన్ కు అనేక కారణాలున్నప్పటికీ విటమిన్ డి లోపం వల్ల అది ధీర్ఘ కాలంలో తీవ్రమైన సమస్యగా మారే ప్రమాదం ఉంది. గర్భధారణ సమయంలో విటమిన్ డి స్థాయిలు తక్కువ ఉండడం.. ప్రసవానంతరం ఎదురయ్యే పరిస్థితులతో ముడిపడి ఉండవచ్చని స్టడీలు చెప్తున్నాయి. ఇది ప్రసవం తర్వాత కొన్ని వారాలు లేదా నెలల వరకు ఆ తల్లులను ప్రభావితం చేస్తుంది. విటమిన్ డి లోపం దీర్ఘకాలిక వెన్నుపాము గాయాలు, స్ట్రోక్, మల్టిపుల్ స్క్లెరోసిస్ కు దారి తీయవచ్చు. ఇది వివిధ మానసిక ఆరోగ్య పరిస్థితులపైనా ప్రభావం చూపుతుంది.

## కాసేపు ఎండలో...

**సూర్యరశ్మి నుంచి మన శరీరానికి అధిక మొత్తంలో విటమిన్ 'డి' అందుతుంది. దానివల్ల ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే నాడీ, కండరాల ఆరోగ్యానికి అవసరం. అంతేకాదు.. రోగనిరోధక వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. కాబట్టి రోజూ ఉదయాన్నేసూర్యకాంతిలో కనీసం పదిహేను నిమిషాలైనా నిలబడమని నిపుణుల మరీ మరీ చెప్తున్నారు. ఆ విటమిన్ పొందడానికి ఏవేవో ప్రయత్నాలు చేయక్కర్లేదు. సరైన ఫుడ్, సన్‌లైట్ ద్వారా తెచ్చుకుంటే సరిపోతుంది. లేదా డాక్టర్ సలహా మేరకు సప్లిమెంట్స్ కూడా తీసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అయితే, అంతదాకా ఎందుకులే అనుకుంటే.. పైన చెప్పినట్టు ఫాలో అయిపోవచ్చు.**

## ఈ సమస్యలన్నీ లోపం వల్లే..

ఒకవేళ ఈ విటమిన్ లోపిస్తే కండరాల బలహీనత, కీళ్ల నొప్పులు, అలసట, ఆందోళన, ఒత్తిడి, జుట్టు రాలడం, దీర్ఘకాలిక జీర్ణ సంబంధిత సమస్యలు.. వంటివి వచ్చే అవకాశం ఉంది. అలాగే చిరాకుగా ఉంటుంది. శక్తిని కోల్పోయినట్లు అనిపిస్తుంది. వీటితో పాటు ఒళ్లు నొప్పులు, చర్మం పొడిబారడం, దురదగా అనిపించడం, జుట్టు రాలి పోయే సమస్యలు తలెత్తుతాయి. ఇమ్యూనిటీ తగ్గుతుంది. ఫలితంగా జలుబు, దగ్గు,జ్వరం వంటి అనారోగ్య సమస్యలు వస్తాయి. నిద్రలేమికి ఇది కూడా ఒక కారణం. డి – విటమిన్ లోపం ఉన్న వారు పదే పదే అనారోగ్యం బారిన పడుతుంటారు. విటమిన్ డి స్థాయిలు మానసిక ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం చూపిస్తాయి. అంతేకాదు.. కొన్ని రకాల క్యాన్సర్‌లకు కూడా కారణమవుతుంది. దీర్ఘకాలిక వ్యాధులైన అధిక రక్తపోటు, గ్లూకోజ్ స్థాయిల నియంత్రణ, గుండె జబ్బులు, అతిసారం, మూత్రాశయ సమస్యలు, ఏకాగ్రత లేకపోవడం కారణంగా సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది.



## ఈ ఫుడ్ తీసుకోవాలి

- ఆవు పాలలో విటమిన్ 'డి' ఎక్కువగా ఉంటుంది. రోజుకు ఒకగ్లాసు ఆవు పాలు తాగడం వల్ల రోజుకి 20 శాతం ఈ విటమిన్ శరీరానికి అందుతుంది.
- పెరుగులో కూడా ప్రొటీన్లతో పాటు 'డి' విటమిన్ ఎక్కువగా ఉంటుంది. కాకపోతే బయటి నుంచి తెచ్చుకోకుండా ఇంట్లోనే పెరుగు తయారుచేసుకుని తీసుకోవడం బెటర్.
- పుట్టగొడుగులు ఎండలోనే పెరుగుతాయి. కాబట్టి వీటిలో విటమిన్ 'డి' స్థాయులు ఎక్కువగా ఉంటాయంటున్నారు నిపుణులు. దీంతో పాటు బి1, బి2, బి5, కాపర్.. వంటి పోషకాలు కూడా పుట్టగొడుగుల్లో అధికంగా ఉంటాయి.
- కమలాఫలంలో విటమిన్ సి, డిలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఇమ్యూనిటీని పెంచుతాయి.
- విటమిన్ 'డి' అధికంగా లభించే పదార్థాల్లో ఓట్స్ కూడా ఒకటి.
- గుడ్డు పచ్చసొనలో విటమిన్ 'డి' తో పాటు ప్రొటీన్లు, కొవ్వులు కూడా ఎక్కువగానే ఉంటాయి. కాబట్టి రోజుకు ఒక పచ్చసొన కంటే ఎక్కువ తీసుకోకూడదట!
- చేపల్లోనూ విటమిన్ 'డి' స్థాయులు ఎక్కువే. అలాగే ఇందులో ఉండే క్యాల్షియం, ప్రొటీన్లు, ఫాస్పరస్.. వంటి పోషకాలు సంపూర్ణ ఆరోగ్యాన్నిస్తాయి.

# మాన్‌సూన్ వెడ్డింగ్‌కి.. ఈ చీరలు బెటర్

వేడుకలకు సీజన్‌తో పనేముంది? ఎప్పుడైనా ఏదో ఒక వేడుక జరుగుతూనే ఉంటుంది. కానీ, వాటికి వెళ్లాలంటే మాత్రం ఎలాంటి బట్టలు వేసుకోవాలి? అనేది పెద్ద ప్రశ్న. ఎందుకంటే అన్నికాలాలకు ఒకేలాంటి బట్టలు వేసుకోవడం కష్టమైన పని. కాలానుగుణంగా ధరిస్తేనే కంఫర్ట్‌గా ఉంటుంది. మామూలుగా వేడుకలకు వెళ్లే వాళ్లు, ముఖ్యంగా పెండ్లిళ్లకు వెళ్లేవాళ్లు పట్టుచీరలకే ఓటేస్తారు. మరి వానాకాలంలో ఎలాంటి చీరలు కట్టుకుంటే బెటర్ అంటే.. పట్టుచీరలు కష్టం. కాస్త తడిచినా అసౌకర్యంగా ఉంటుంది. కాబట్టి సరైన దుస్తులు వేసుకుంటే ఆ సౌకర్యమే వేరు. అవేంటో తెలుసుకుందాం.





షిఫాన్... చాలా తేలికగా, కాస్త పలుచగా ఉండే ఫ్యాబ్రిక్. మెత్తగా, లైట్ వెయిట్‌తో ప్రత్యేకంగా, చూడటానికి హుందాగా ఉంటుంది. డ్రెస్సులు, స్కర్టులకు ఈ క్లాత్ చాలా బాగా సెట్ అవుతుంది. దాంట్లో చాలా రంగులు, ప్యాటర్న్స్ ఉంటాయి.

కాటన్... ఒక సాంప్రదాయ, క్లాసిక్ ఫ్యాబ్రిక్. ఇది కూడా చాలా తేలికగా, సౌకర్యంగా ఉంటుంది. డ్రెస్సులు, సూట్లకు కూడా బాగుంటుంది. కాటన్‌లో చాలా రకాల అల్లికలుంటాయి. వేడిని, తేమని తట్టుకుంటాయి.

లెనిన్... ఇది కాటన్ లాగే తేమను బాగా పీల్చుకుంటుంది. ఇది స్టైలిష్ లుక్ ఇస్తుంది. చీర కట్టుకున్నా, డ్రెస్ అయినా బాగుంటుంది.ఇది చూడటానికి చాలా రిచ్ గా కనిపిస్తుంది. అలాగే సౌకర్యంగానూ ఉంటుంది. రేయాన్ ఫ్యాబ్రిక్ కూడా స్టైలిష్ గా ఉంటుంది.

# ఆహారాన్ని గొడుగుతో కప్పేద్దాం!



'ఫుడ్ కవర్'... మీల్స్, టీ, స్నాక్స్ ఏ ఫుడ్ అయినా తినగా మిగిలిపోతే.. దాన్ని అలానే వదిలేయలేం కదా. మూతతో, క్లాత్‌తో కవర్ చేస్తుంటాం. కానీ, ఒక్కోసారి అలా కవర్ చేయడం వల్ల గాలి ఆడక అవి పాడైపోతాయి. అలాగని కవర్ చేయకపోతే.. ఈగలు ముసురుతుంటాయి. ఆ ఆహారాన్ని తినలేం కదా! ఈ సమస్యకు చెక్ పెట్టేందుకే ఈ ఫుడ్ కవర్లు. చూడ్డానికి గొడుగులా ఉన్న ఈ ఫుడ్ కవర్.. వాడడం చాలా తేలిక. గొడుగును వాడినట్టే వాడితే సరి. డైనింగ్ టేబుల్ మీద, ఫ్లోర్ మీద ఎక్కడైనా దీన్నిపెట్టొచ్చు. ఒకవేళ మాసిపోయినా కూడా శుభ్రపరచడం ఈజీనే. పైగా మడిచే సౌకర్యం ఉంటుంది. కాబట్టి వెకేషన్లకు వెళ్లినా వెంట తీసుకెళ్లొచ్చు.

చురకలు



# ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో భారత్ డబుల్ ధమాకా

**ఈషాకు గోల్డ్, మనుకు బ్రాంజ్..**




గిన ఫ్రాన్స్‌ను 2-0 గోల్స్ తేడాతో ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. టెక్సాస్‌లోని డల్లాస్ స్టేడియంలో జరిగిన తొలి సెమీఫైనల్‌లో స్పెయిన్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. 2010లో ప్రపంచకప్ గెలిచిన తర్వాత మరోసారి ఫైనల్‌లో అడుగుపెట్టడం స్పెయిన్‌కు ఇదే తొలిసారి. మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన స్పెయిన్‌కు 22వ నిమిషంలో పెనాల్టీ లభించింది. యువ ఆటగాడు లామిన్ యమాల్‌పై ఫ్రాన్స్ డిఫెండర్ లూకాస్ డిగ్నే ఫౌల్ చేయడంతో రిఫరీ పెనాల్టీ ఇచ్చారు. ఆ అవకాశాన్ని మికెల్ ఒయర్‌జాబల్ సద్వినియోగం చేసుకుని తొలి గోల్ నమోదు చేశాడు. అనంతరం 58వ నిమిషంలో డానీ ఓల్మోతో చక్కటి పాస్‌ల మార్పిడి అనంతరం పెడ్రో పోరో బంతిని గోల్‌పోస్ట్‌లోకి పంపి స్పెయిన్ ఆధిక్యాన్ని 2--0కు పెంచాడు. ఫ్రాన్స్ తరఫున కైలియన్ ఎంబాపే, ఉస్మాన్ డెంబెలే, మైఖేల్ ఒలిసే వంటి స్టార్ ఆటగాళ్లు బరిలో ఉన్నప్పటికీ స్పెయిన్ కట్టుదిట్టమైన రక్షణను ఛేదించలేకపోయారు. స్పెయిన్ డిఫెన్స్ ముందు ఫ్రాన్స్ దాడులు పూర్తిగా విఫలమయ్యాయి. దీంతో వరుసగా మూడో ప్రపంచకప్ ఫైనల్‌కు చేరాలన్న ఫ్రాన్స్ ఆశలు గల్లంతయ్యాయి. 14 ఏళ్లుగా జట్టును నడిపిస్తున్న కోచ్ డిడియర్ డెషాంప్స్‌కు ఈ ఓటమి నిరాశ మిగిల్చింది. విజయం అనంతరం స్పెయిన్ ప్రధాన కోచ్ లూయిస్ డి లా ఫ్యూయెంటె జట్టు సమష్టి ప్రదర్శనను ప్రశంసించాడు. ఫ్రాన్స్ బలమైన దాడులను సమర్థంగా అడ్డుకోవడంలో ఆటగాళ్లు విజయవంతమయ్యారని పేర్కొన్నాడు. ఆదివారం న్యూజెర్సీలోని న్యూయార్క్-న్యూజెర్సీ స్టేడియంలో జరిగే ఫైనల్‌లో అర్జెంటీనా-ఇంగ్లండ్ రెండో సెమీఫైనల్ విజేతతో స్పెయిన్ తలపడనుంది.

## పట్టువదలని జ్ఞానేశ్వరి.. కామన్వెల్త్‌లో వెండి వెలుగు

**53 కేజీల వెయిట్‌లిఫ్టింగ్‌లో రజత పతకం సాధించిన భారత లిఫ్టర్**

**హోరాహోరీ పోరులో పసిడికి చేరువగా నిలిచిన జ్ఞానేశ్వరి యాదవ్**




**గ్లాస్గో, జూలై 27:** కామన్వెల్త్ క్రీడల్లో భారత వెయిట్‌లిఫ్టర్ల పతకాల పంట కొనసాగుతోంది. ఇప్పటికే మీరాబాయి చాను, రిషికాంత్ సింగ్, రాజా ముత్తుపాండీలు పతకాలు సాధించగా.. తాజాగా భారత వెయిట్‌లిఫ్టర్ జ్ఞానేశ్వరి యాదవ్ దేశానికి మరో రజత పతకాన్ని అందించింది. సోమవారం జరిగిన మహిళల 53 కిలోల విభాగం ఫైనల్లో అద్భుత ప్రదర్శన కనబరిచిన జ్ఞానేశ్వరి, చివరి వరకు స్వర్ణ పతకం కోసం పోరాడి వెండితో సరిపెట్టుకుంది. స్నాచ్ విభాగంలో తొలి ప్రయత్నంలో 82 కిలోలు ఎత్తిన జ్ఞానేశ్వరి, రెండో ప్రయత్నంలో 85 కిలోలు, మూడో ప్రయత్నంలో 88 కిలోలు విజయవంతంగా ఎత్తి రెండో స్థానంలో నిలిచింది. అయితే నైజీరియాకు చెందిన ఒనొమె ఒమొలోలా దిదిహ్ 90 కిలోలు ఎత్తి ఆధిక్యంలో నిలవడంతో స్వర్ణ పతక పోరు మరింత ఉత్కంఠభరితంగా మారింది. అనంతరం క్లిన్ అండ్ జర్క్ విభాగంలోనూ జ్ఞానేశ్వరి ధైర్యంగా పోటీ కొనసాగించింది. తొలి ప్రయత్నంలో 103 కిలోలు, రెండో ప్రయత్నంలో 107 కిలోలు విజయవంతంగా ఎత్తింది. చివరి ప్రయత్నంలో 111 కిలోలు లిఫ్ట్ చేసి తన పట్టుదలను చాటుకుంది. ప్రత్యర్థి ఒనొమె కూడా అదే బరువును విజయవంతంగా ఎత్తడంతో మొత్తం 199 కిలోల బరువును ఎత్తిన జ్ఞానేశ్వరి రజత పతకాన్ని ఖాయం చేసుకుంది. ఈ విజయంతో కామన్వెల్త్ క్రీడల్లో భారత వెయిట్‌లిఫ్టర్ల ఖాతాలో మరో విలువైన పతకం చేరింది. గాయాలు, ఒత్తిళ్లను అధిగమిస్తూ అద్భుత ప్రదర్శన చేసిన జ్ఞానేశ్వరి యాదవ్ యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచింది. ఆమె సాధించిన ఈ రజత పతకం భారత వెయిట్‌లిఫ్టింగ్‌కు మరో గర్వకారణంగా నిలిచింది.



## మృణాల్-యశస్వి డేటింగ్ రూమర్స్

### వైరల్ వీడియోతో మొదలైన చర్చ

**ముంబై:** బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్, భారత యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్ డేటింగ్ చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో ఊహాగానాలు వైరల్ అవుతున్నాయి. అయితే, ఈ వార్తలకు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధృవీకరణ లేదు. ముంబైలోని ఓ ప్రముఖ కేఫ్ వద్ద జరిగిన ఘటనతో ఈ ప్రచారం మొదలైంది. ముందుగా మృణాల్ ఠాకూర్ కేఫ్‌లోకి వెళ్లగా, కొంతసేపటి తర్వాత అదే కేఫ్ నుంచి యశస్వి జైస్వాల్ బయటకు వస్తూ కెమెరాలకు చిక్కారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఇద్దరూ కలిసి సమయం గడిపారని, ప్రేమలో ఉన్నారని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. అయితే, ఒకే ప్రదేశంలో కనిపించడమే డేటింగ్‌కు నిదర్శనం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రకటన చిత్రీకరణ, బ్రాండ్ ప్రమోషన్ లేదా వృత్తిపరమైన సమావేశం కోసం ఇద్దరూ అక్కడికి వచ్చి ఉండొచ్చని కూడా చెబుతున్నారు. దీంతో ప్రస్తుతం జరుగుతున్న ప్రచారం అంతా ఊహాగానాలేనని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. మృణాల్ ఠాకూర్, యశస్వి జైస్వాల్ మధ్య సుమారు తొమ్మిదేళ్ల వయసు తేడా ఉండటంతో దీనిపై కూడా సోషల్ మీడియాలో చర్చ సాగుతోంది. కొందరు కామెంట్లు చేస్తుండగా, మరికొందరు సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై ఆధారాలు లేకుండా ప్రచారం చేయడం సరికాదని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు ఈ డేటింగ్ రూమర్స్‌పై మృణాల్ ఠాకూర్ గానీ, యశస్వి జైస్వాల్ గానీ స్పందించలేదు. దీంతో ఈ వార్తలను అధికారికంగా ధృవీకరించే సమాచారం బయటకు రాలేదు. ఇదిలా ఉండగా, మృణాల్ ఠాకూర్ పేరు గతంలో కూడా పలువురు సినీ ప్రముఖులతో ముడిపడి వార్తల్లో నిలిచింది. ముఖ్యంగా నటుడు ధనుష్‌తో ఆమె పెళ్లి చేసుకోబోతున్నారంటూ వచ్చిన ప్రచారాన్ని ఆమె సన్నిహితులు ఖండించారు. ప్రస్తుతం మృణాల్ వరుస సినిమాలతో బిజీగా ఉండగా, యశస్వి జైస్వాల్ భారత క్రికెట్ జట్టులో యువ స్టార్‌గా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఈ డేటింగ్ ప్రచారంపై ఇద్దరిలో ఎవరైనా స్పందిస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

## వైభవ్ బ్యాట్ మళ్లీ గర్జించేది ఎప్పుడు?

**తదుపరి మ్యాచ్ కోసం అభిమానుల ఎదురుచూపులు**

**న్యూఢిల్లీ, జూలై 27:** జింబాబ్వే పర్యటనలో అద్భుత ఆటతీరుతో భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరోసారి అందరి దృష్టిని ఆకర్షించాడు. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో రెండు అర్ధశతకాలతో మెరిసిన ఈ 15 ఏళ్ల యువ బ్యాటర్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును సొంతం చేసుకుని తన ప్రతిభను చాటుకున్నాడు. హరారే వేదికగా అతని దూకుడు బ్యాటింగ్ అభిమానులతో పాటు మాజీ క్రికెటర్ల ప్రశంసలు కూడా అందుకుంది. వైభవ్ ఆటపై స్పందించిన భారత మాజీ వికెట్‌కీపర్ ఫరూక్ ఇంజనీర్.. అతడికి వన్డే జట్టులో కూడా అవకాశం కల్పించాలని సూచించారు. చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో ఇలాంటి ప్రదర్శన చేయడం అరుదైన విషయమని కొనియాడారు. అయితే వైభవ్ అభిమానులు అతడి తదుపరి మ్యాచ్ కోసం కొంతకాలం వేచి చూడాల్సి ఉంటుంది. భారత జట్టు తర్వాత శ్రీలంక పర్యటనలో రెండు టెస్టుల సిరీస్ ఆడనుండగా, వైభవ్ టెస్ట్ జట్టులో చోటు దక్కించుకోలేదు. దీంతో ఆ సిరీస్‌లో అతను బరిలోకి దిగే అవకాశం లేదు. అయితే ఈ ఏడాది అక్టోబర్‌లో వెస్టిండీస్‌తో భారత్ స్వదేశంలో ఆడనున్న పరిమిత ఓవర్ల సిరీస్‌లో వైభవ్ మళ్లీ కనిపించే అవకాశాలు బలంగా ఉన్నాయి. మూడు వన్డేల అనంతరం జరిగే ఐదు టీ20ల సిరీస్‌కు అతను ఎంపికయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. వెస్టిండీస్‌తో తొలి టీ20 మ్యాచ్ అక్టోబర్ 6, 2026న లక్నోలోని ఎకానా క్రికెట్ స్టేడియంలో జరగనుంది. జింబాబ్వే పర్యటనలో తన బ్యాట్‌తో మెరుపులు మెరిపించిన వైభవ్ సూర్యవంశీ, మరోసారి భారత జెర్సీలో పరుగుల వరద పారిస్తాడని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అతని బ్యాట్ నుంచి వచ్చే భారీ సిక్సర్లు, ఆకర్షణీయమైన ఫోర్లు మరోసారి చూడాలని క్రికెట్ అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



## భారత్ ఖాతాలో మరో పతకం

**వెయిట్‌లిఫ్టింగ్‌లో రజతం గెలుచిన రాజా ముత్తుపాండి ● కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత క్రీడాకారుల జోరు**



**గ్లాస్గో:** చాలా కాలం తర్వాత గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో సత్తా చాటుతున్నారు. తాజాగా వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ మరో పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. పురుషుల 65 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో భారత వెయిట్‌లిఫ్టర్ రాజా ముత్తుపాండి రజత పతకాన్ని కైవసం చేసుకుని దేశానికి గర్వకారణంగా నిలిచారు. ఫైనల్లో రాజా ముత్తుపాండి స్నాచ్, క్లీన్ అండ్ జర్క్ విభాగాల్లో కలిపి మొత్తం 286 కిలోగ్రాముల బరువును ఎత్తి రెండో స్థానంలో నిలిచారు. ఈ విభాగంలో మలేషియాకు చెందిన అజ్నిల్ బిన్ బిదిన్ ముహమ్మద్ అసాధారణ ప్రతిభ కనబరిచారు. మొత్తం 299 కిలోగ్రాములు ఎత్తి ప్రపంచ రికార్డును బద్దలు కొట్టడంతో పాటు స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నారు. ఇక పాపువా న్యూ గినియాకు చెందిన మోరేయా బారు కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. చివరి వరకు తీవ్రమైన పోటీ ఎదురైనప్పటికీ, రాజా ముత్తుపాండి తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుని రజత పతకాన్ని ఖరారు చేసుకున్నారు. ఈ విజయంతో కామన్వెల్త్ గేమ్స్ 2026లో వెయిట్‌లిఫ్టింగ్ విభాగాల్లో భారత్ సాధించిన పతకాల సంఖ్య మరింత పెరిగింది. రాజా ముత్తుపాండి క్రీడా ప్రయాణం ఎన్నో కష్టనష్టాలతో సాగింది. 2017లో యూత్ కామన్వెల్త్ గేమ్స్, జూనియర్ ఛాంపియన్‌షిప్‌లలో పతకాలు గెలిచిన ఆయన, 2019లో లిగమెంట్ గాయం కారణంగా కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌నకు దూరమయ్యారు. శస్త్రచికిత్స అనంతరం చాలా కాలం విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది. 2021లో జాతీయ ఛాంపియన్‌షిప్‌లో మూడో స్థానం సాధించినా, 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌కు అర్హత సాధించలేకపోయారు. అయినా వెనకడుగు వేయని రాజా, కఠిన సాధనతో తిరిగి ఫామ్‌లోకి వచ్చారు. 2024లో 61 కేజీల విభాగంలో జాతీయ రికార్డును బద్దలు కొట్టిన ఆయన, 2025 కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌లోనూ రజతం సాధించారు. ఇప్పుడు గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో రజతం గెలిచి తన పట్టుదలను చాటుకున్నారు. తదుపరి లక్ష్యంగా లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో భారత్‌కు పతకం సాధించిపెట్టడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు.




# ఆదర్శ కుటుంబంలో చిట్టిబాబు గ్లింప్స్ విడుదల

టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్నచిత్రం 'ఆదర్శ కుటుంబం' వెంకీ 77వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను గాంధీ జయంతి సందర్భంగా, అక్టోబర్ 2వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. ప్రతి కుటుంబం గుర్తుపెట్టుకోవాల్సిన తేదీ.. అక్టోబర్ 2న ఆదర్శ కుటుంబం తలుపులు తెరుచుకోబోతున్నాయి..అంటూ మేకర్స్ హైప్ పెంచేస్తున్నారు. తాజాగా ప్రమోషన్స్‌లో భాగంగా వెంకీ పోషిస్తున్న చిట్టిబాబు పాత్ర గ్లింప్స్‌ను షేర్ చేశారు. కిచెన్‌లో ఏసీనా.. నాన్న నువ్వు వంట చేసేటప్పుడు హ్యాపీగా ఏసీ వేసుకుని చేసుకోవచ్చు. అవును నేను మ్యాన్ ఆఫ్ ది హౌస్. వాషింగ్ మెషిన్ కూడా ఉంది.. నీకు పని బాగా తగ్గిపోయినట్టేనని శ్రీనిధి శెట్టి అంటున్న డైలాగ్స్‌తో షురూ అయింది గ్లింప్స్. చిట్టిగారు అని రఘుబాబు అంటుంటే అస్తమానం తలతిప్పకండి బుజ్జిగారు మెడ పట్టేస్తుంది.. నాకు ఎవరేం పని చేసినా నచ్చదు. అందుకే అన్నీ నేనే చూసుకుంటానంటున్నాడు వెంకీ.. ఆదర్శ కుటుంబం అంటూ నారా రోహిత్ డైలాగ్స్‌తో ఎండ్ అయింది గ్లింప్స్. మొత్తానికి చిట్టిబాబుగా వెంకీ అండ్ ఫ్యామిలీ పక్కా వినోదాన్నిఅందించబోతుందని తాజా గ్లింప్స్ చెప్పకనే చెబుతోంది. ఈ చిత్రంలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు), వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తున్నాడు. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న మొదటి ఫుల్ లెంగ్త్ సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి.

# త్వరలోనే రాకా షూటింగ్‌లోకి..



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక పాన్-ఇండియా చిత్రం రాకా పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కొత్త షూటింగ్ షెడ్యూల్‌కు సంబంధించిన ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం, చిత్రబృందం త్వరలో ప్రారంభం కానున్న కొత్త షెడ్యూల్‌లో అల్లు అర్జున్ ఇంట్రడక్షన్ సీన్ చిత్రీకరించనుంది. ఈ సీన్‌ను సినిమాకే హైలైట్‌గా నిలిచేలా అత్యంత భారీ స్థాయిలో ఎ÷-లాన్ చేసినట్లు తెలుస్తోంది.ఈ ఎపిసోడ్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మించినట్లు సమాచారం. అట్లీ మార్క్ స్టైలిష్ విజువల్స్, హై వోల్టేజ్ యాక్షన్‌తో బన్నీ ఎంట్రీ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ ఇచ్చేలా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ ఇప్పటివరకు కనిపించని వైల్డ్ అండ్ రగ్గడ్ లుక్లో కనిపించనున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఇంట్రడక్షన్ సీన్‌లో ఆయన మేకోవర్, బాడీ లాంగ్వేజ్, యాక్షన్ స్టైల్ అభిమానులను ఆశ్చర్యపరిచేలా ఉంటాయని సమాచారం. 'పుష్ప' తర్వాత మరోసారి పూర్తిగా భిన్నమైన పాత్రలో బన్నీ కనిపించనున్న నేపథ్యంలో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'రాకా'లో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ దీపికా పదుకొణె నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమెతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. ముగ్గురు స్టార్ హీరోయిన్లు ఒకే సినిమాలో భాగం కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'రాకా' కథ మాఫియా ప్రపంచం చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. ఓ శక్తివంతమైన డాన్ జీవితాన్ని కేంద్రంగా చేసుకుని యాక్షన్, ఎమోషన్స్, థ్రిల్లింగ్ మలుపులతో కథ సాగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అట్లీ తన గత చిత్రాల మాదిరిగానే కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు భారీ విజువల్ ట్రీట్‌ను అందించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తోంది.

### 52 ఏళ్ల వయసులోనూ

# తగ్గేదేలే..

బాలీవుడ్ గ్లామరస్ బ్యూటీ మలైకా అరోరా తన వ్యక్తిగత జీవితంతో నిత్యం వార్తల్లో నిలుస్తుంటారు. సినిమాల కంటే ప్రేయ వ్యవహారాల కారణంగానే సోషల్ మీడియాను షేక్ చేస్తుంటారు. యంగ్ హీరో అర్జున్ కపూర్‌తో సుదీర్ఘ బంధానికి స్వస్తి చెప్పిన తర్వాత, ఆమె లైఫ్‌లోకి మరో కొత్త వ్యక్తి ఎంట్రీ ఇచ్చారనే వార్త ఇప్పుడు బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తాజా సమాచారం ప్రకారం.. మలైకా ప్రముఖ డైమండ్ వ్యాపారి హర్ష్ మెహతాతో డేటింగ్‌లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల ముంబైలోని బాంద్రాలో జరిగిన ఒక గ్రాండ్ ప్రైవేట్ పార్టీకి మలైకా తన కొడుకు అర్హాన్ ఖాన్‌తో కలిసి హాజరయ్యారు. అదే పార్టీలో హర్ష్ మెహతా కూడా సందడి చేయడంతో వీరిద్దరి రిలేషన్‌షిప్‌పై వచ్చే రూమర్లకు మరింత బలం చేకూరింది. 52 ఏళ్ల మలైకా, తనకంటే 19 ఏళ్లు చిన్నవాడైన హర్ష్ మెహతాతో డేటింగ్ చేయడంపై సోషల్ మీడియా వేదికగా విపరీతమైన ట్రోలింగ్ జరుగుతోంది. గతంలో తనకంటే 12 ఏళ్లు చిన్నవాడు అర్జున్ కపూర్ విషయంలో ఎదుర్కొన్న విమర్శల తరహాలోనే, ఇప్పుడు కూడా నెటిజన్లు రకరకాల కామెంట్స్ చేస్తున్నారు.



# అఖిల్ వ్యక్తిగత జీవితంపై ట్రోలింగ్



### జైన్ కులం, మతంపై విమర్శలు..

### పట్టించుకోని యువనటుడు

అక్కినేని హీరో అఖిల్ అక్కినేని తన వ్యక్తిగత జీవితంపై వచ్చిన ట్రోలింగ్‌కు తొలిసారి ఘాటుగా స్పందించారు. గతేడాది తన ప్రేయసి జైనబ్‌ని వివాహం చేసుకున్న తర్వాత సోషల్ మీడియాలో ఆమె వయసు, మతంపై వచ్చిన విమర్శలను తాము ఏమాత్రం పట్టించుకోలేదని స్పష్టం చేశారు. ప్రేమ, పరస్పర అవగాహన, ఒకరిపై ఒకరికి ఉన్న నమ్మకమే తమ బంధానికి అసలైన బలమని చెప్పారు. 'లెనిన్' సినిమాతో కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని అందుకున్న అఖిల్, ఓ తాజా పోడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు విషయాలను పంచుకున్నారు. పెళ్లి తర్వాత సోషల్ మీడియాలో వచ్చిన నెగెటివ్ కామెంట్స్ గురించి అడగగా.. అలాంటి విషయాలకు తాము అసలు ప్రాధాన్యం ఇవ్వలేదని తెలిపారు. కొన్ని రోజుల పాటు సోషల్ మీడియాలో వచ్చే కామెంట్స్ గురించి ఆలోచించాలా? లేక జీవితాంతం నాతో ఉండే వ్యక్తితో సంతోషంగా జీవించడం గురించి ఆలోచించాలా? నాకు రెండోది ముఖ్యమైంది. అందుకే ట్రోలింగ్‌ను ఎప్పుడూ సీరియస్‌గా తీసుకోలేదని అఖిల్ అన్నారు.పెళ్లికి ముందే తమ జీవితంలో ఇలాంటి విమర్శలు వస్తాయని జైనబ్‌కు చెప్పినట్లు అఖిల్ వెల్లడించారు.నేను నటుడిని. నా జీవితంలోకి వచ్చిన తర్వాత సోషల్ మీడియాలో విమర్శలు తప్పవు. అందుకు సిద్ధంగా ఉండాలని నేను ముందుగానే చెప్పాను. ఆమె కూడా చాలా పరిణతితో అర్థం చేసుకుంది. వయసు, మతం గురించి వచ్చిన కామెంట్లను ఎంతో పాజిటివ్‌గా తీసుకుంది. అదే నాకు మరింత ధైర్యాన్ని ఇచ్చింది అని తెలిపారు. తన కెరీర్‌లో అత్యంత క్లిష్టమైన సమయంలో జైనబ్ తనకు అండగా నిలిచిందని అఖిల్ భావోద్వేగంగా చెప్పారు. ప్రేమలో కులం, మతం, వయసు కంటే పరస్పర అవగాహన, నమ్మకం ముఖ్యమని అఖిల్ అభిప్రాయపడ్డారు. పెళ్లికి ముందు

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com